ఫ్రెంచిఓడలును 1854–వ సం. జనవరినెల 3 తేది నల్ల సముద్రమునందు ప్రవేశించెను. సుమారు మూఁడునెలలకుమీఁద క్రిమియాను గూర్చి సైన్యము పోయెను. ఆల్మా నదీతీరమున రష్యావారికిని ఆంగ్లేయులకును ఘోరయుద్ధము జరిగెను. ఆపిమ్మట బాలకిలావా అను చోటను, అనంతరము ఇంగర్మాన్ అనుచోటను ఇరుతెగలవారికిని యుద్ధములు జరిగినవి. ఈ యుద్ధములందెల్లను ఆంగ్లేయులే జయించిరి.

నైటింగేల్ మహోపకారము

యుద్ధమునందు గాయపడినవారికి ఆస్పత్రులలో చికిత్స చేయఁబడినను, ఫ్లారెన్సు నైటింగేల్ అను విదుషీమణి చేసిన యుపచారము కొనియాడఁదగినది. ఆమె గాయపడిన యోధులయొక్క పరితాపమును బాపి, గాయములార్పనెంచి తనతోఁగూడ పలువురు ఆంగ్లేయ వనితలను వెంటఁబెట్టుకొనిపోయి, తల్లి బిడ్డలను పోషించునట్లు ఆసమయమున వారికి హితముజెప్పి కట్లుకట్టి కాపాడెను.

మూర్ఖులగు భటులుసైత మామెను తల్లివలె భావించిరి. ఆమె ఆయావీరులకడకుపోయి శాంతవచనములతో మాటలాడును. అన్యదేశములో ఆపదలోనున్నవారిని ఆమె ఎంతో ప్రయాసపడి స్వస్థపఱచెను. ఆమె స్వదేశమున కేఁగునపుడు ఆమెను మహోత్సవముతో నింటికిఁ దోడ్కొనిపోవుటకై ప్రయత్నించిరిగాని ఆమె అందుల కంగీకరింపక సాధా

రణమైన బాటసారివలె నింటికి యింటరిగాఁ బోయెను. భటులు మొదలగువారు ఆమెయొక్క సత్కార్య స్మృతికొఱకు ఏదేని యొకస్థాపనము చేయవలయుఁ నని అయిదులక్షల రూపాయలు జమచేసిరి. నైటింగేలు దొరసాని ఆధనమును రోగుల కుపచారములుచేయుటకు నేర్చికొనుదాదుల కీయవలసినదని కోరెను. ఆమె కోరికచొప్పుననే ఆమెపేర ఆనిధి స్థాపింపఁబడియెను. విక్టోరియా మహారాజ్ఞిగారు ఆమెయొక్క ఉదారస్వభావమునకును కనికరమునకును చాలమెచ్చి "ధీరులగు సైనికులకు కావించిన యుపకారమునకై కృతజ్ఞతా గౌరవసూచకముగా నీయఁబడినది" అని లిఖియింపించిన వజ్రాలపతకమును బహుమానముగా నొసంగిరి.

కృతజ్ఞత.

పిమ్మట కొంచెము గాయములతో ఇంగ్లండుచేరి ఆస్పత్రులందు చికిత్సలందుచుండిన యుద్ధభటులు మొదలగు వారిని విక్టోర్యారాణిగారు అపుడపుడు పోయి చూచుచు, ఒక్కరొక్కరితోను మాటలాడి ధైర్యము చెప్పుచు నుండిరి. విక్టోర్యామహారాజ్ఞిగారు యోధులకు విజయ పతకములను తమచేతితోనే గౌరవార్థముగా నొసంగిరి.

రష్యారాజు మరణము

ఇట్లు క్రూరయుద్ధము జరుగుచున్నపుడే 1855-వ సంవత్సరము మార్చి నెల 2 తేది రష్యాచక్రవర్తి లోకాంతరగతుఁ

డాయెను. ఇతనిమరణమునకుఁ గారణము అతనికిఁ గలిగిన అపజయముచేత గుండెపగిలి మృతినొందుటయే యని కొందఱనెదరు.

ఐకమత్యము

క్రిమియా యుద్ధమునందు ఆంగ్లేయులకు ఫ్రెంచివారు సహాయముచేసినందున బ్రిటిషు రాజాంగమువారికిని ఫ్రెంచి రాజాంగమువారికిని పరస్పరము స్నేహము అభివృద్ధి యాయెను. 1855-వ సంవత్సరము ఏప్రెపెల్ నెల ఫ్రెంచిదేశాధిపతి రాణితోను పరివారముతోను లండన్ నగరమునకు విజయముచేసెను. విక్టోర్యారాణిగారు వారిని యెదుర్కొని పోయి తోడితెచ్చి విండ్సర్ భవనమునందు విడియింపఁజేసి చాల గౌరవించిరి.

విక్టోర్యా రాణిగారు ఫ్రాన్సుకు బోవుట.

ఫ్రెంచి మహారాజు లండన్ నగరమునకు వచ్చి మఱలి పోయినమీఁద. విక్టోర్యా రాజ్ఞిగారు ఆ 1855-వ సంవత్సరము ఆగస్టు నెల 18 తేది భర్తతోను ఇద్దఱు బిడ్డలతోనుగూడి ఫ్రాన్సు నగరమున కేఁగిరి. ఫ్రెంచిదేశాధిపతి విక్టోరియా మహారాజ్ఞిగారిని మిగులగౌరవముతో సత్కరించిరని వేఱుగాఁ జెప్పవలసినది లేదుకదా?


యుద్ధసమాధానము

1856-వ సంవత్సరమునందు సిబాస్టపూల్ యుద్ధమునందు రష్యావారు ఓడిపోయినతరువాత తుర్కీని వదలిపెట్టి పాఱిపోయిరి. ఆ పిమ్మట ఆంగ్లేయులును రష్యావారును సమాధానముచేసికొని యుద్ధమును చాలించిరి.

బిడ్డలను పెంచుట

లోకమునందు కొందఱు ధనికులు బిడ్డలను చాలగారాబముతో కాపాడుచుందురు. తుదకు వారు ఎదిగినకొలఁది బుద్ధిమాంద్యులై పోవుటకుఁ దగినట్టి సదుపాయములను కల్పించి యిత్తురు. ఇది యెంతయు అవివేకమైన కార్యమే.

విక్టోరియా మహారాజ్ఞిగారు అలాగుచేయక బిడ్డల యొక్క విద్యాభివృద్ధికిని కలాకౌశల్యాభివృద్ధికిని వ్యవసాయాభివృద్ధికినిఁ దగిన యేర్పాటులను జేసిరి. ఆస్బోర్న్ మందిర ప్రదేశమునందు తమబిడ్డలకు చిన్నచిన్న ఇండ్లను కట్టించిరి. ఒక్కొకరికిని ఒక్కొక పూవులతోఁటయు, ఒక్కొక కూరగాయలతోఁటయు నేర్పఱిచిరి. ఒక్కొకరును తమకని యేర్పాటు చేయఁబడిన తోఁటలో పనిచేసి దానిని పెంపొందించుచుండిరి. ఒకచోట వడ్రంగిశాల నేర్పఱుపఁబడియుండెను. ఆశాలలో మగబిడ్డలుపోయి పనులుచేయుచుండిరి. బిడ్డలు పచారుచేయుటకు పోవునప్పుడును స్వారి వెడలునప్పు



ఆక్ ఫోర్డు మందిరము

డును వారికి విద్య నేర్పఁబడుచుండెను. బిడ్డలకు సకల శాస్త్ర పరిచయములును కలుగుటకుఁ దగిన అనుకూలములు కావించిరి. ఆల్బర్టు ప్రభువుగారు తమ బిడ్డలయొద్ద నేయుండి వారియొక్క పురోవృద్ధికి తగిన పద్ధతులను దెలియఁ జేయుచుండిరి.

అగ్ని ఆపద

1856 వ సంవత్సరము మే నెలలో మహారాజ్ఞిగారియొక్క పెద్దకొమార్తయైన రాయల్ ప్రభ్విగారి చొక్కాయికి నిప్పంటుకొనెను. ఆమెయొక్క సోదరి ఆలిస్ ప్రభ్వియును ఒక దాసియును సమీపమున నుండిరి. కావున వారు మిగుల ధైర్యముతో మంట నార్పిరి. అయినను మంట నార్పునంత లోపలనే మోచేతినుండి భుజములవఱకు కాలిపోయినది. రాయల్ ప్రభ్విగారు మిగుల ధైర్యముతో తొందరపడక యున్నందువలన అంతటితో పోయినదిగాని లేకున్నచో ఒడలెల్ల కాలిపోయి యుండును.

బీట్రిస్ జననము

1857 వ సంవత్సరము ఏప్రెల్ నెల 14 తేది మహారాజ్ఞిగారికి స్త్రీశిశువు జనించెను. ఈమెయే కడపటిసంతానము. ఈమెకు బీట్రిస్ అని నామకరణము చేసిరి. అందఱి బిడ్డలవలెనే యీమెయు పోషింపఁబడుచుండెను. ఈమె తన యిరువది యెనిమిదవయేఁట బాటెంబర్గు రాజకుమారుఁడైన

హెన్రి అనునతనిని వరించెను. ఈమె తల్లిగారియింటనే ప్రత్యేకముగా కాపురము చేయుచుండెను. ఈమెకు నలుగురు సంతానము కలిగిరి. ఈమె పెనిమిటి ఆఫ్రికాఖండమునకు సేనానాయకుఁడుగా నియమింపఁబడి పోవుచుండఁగా మార్గ మధ్యమున సముద్రము మీఁదుగనే 1896 వ సంవత్సరము మొదట విషజ్వరముచే మృతినొందెను.

ఇండియాయందు కలహములు

1857వ సంవత్సరము మేనెల 10 తేది మీరత్ అనుచోట మొట్టమొదట కలహారంభమయ్యెను. ఆకలహముక్రమముగా బంగాళమువఱకు వ్యాపించెను. బంగాళ దేశమునందు సిపా యీలందఱును ఏకమై ఆంగ్లేయులను, వారి సైన్యమును, నాశ ముచేయవలయునని సంకల్పించినవారై బ్రిటిషు దొరతనము వారిపై తిరుగఁబాటు చేసిరి. అందులకుఁ దోడుగా నానా సాహేబు అనువాఁడు ఆసిపాయీలను ప్రోత్సాహపఱచినదే గాక, వాఁడు చాలమంది దుర్మార్గులును వెంటఁబెట్టు కొని వచ్చి అనేక క్రూరకృత్యముల నాచరించుచుండెను. ఇట్లుండునపుడే ఇంగ్లండులోనుండి ఆంగ్లేయసైన్యము ఇండి యాకు వచ్చిచేరెను. మఱియు మేనెల 30 తేది లక్నో (లక్ష్మణ పురము) అనుచోటను కలహ మంకురించెను. అనంతరము కాన్పురమునందును కలహము పుట్టెను. కాన్పురమునకు

లక్నోనగరముునను ఆంగ్లేయ సైనికులు చాల శ్రమనొందిరి. అయినను వారు ఢిల్లీనగరమును కాపాడవలసినవారై నందున ఆంగ్లేయసైన్యము ఢిల్లికి పోయెను. ఆంగ్లేయులకు సీక్కు రాజులును సీక్కు యోధులును సహాయముచేసిరి. అందువలన కలహకారకులను అణంగద్రొక్కుట సులభమైనది. జూను నెల 8 తేది ఉదయము 9 గంటలకు ఢిల్లీ నగరంబున ఆంగ్లేయ ధ్వజము ఎగురుచుండెను. అయినను మూఁడు నెలలు ఘోరయుద్ధము జరిగెను. తుదకు సెప్టంబరు నెల 20 తేది శత్రువులు సంపూర్ణముగా అపజయము నొందిరి. ఢిల్లి ఆంగ్లేయుల వశమాయెను. 1858 వ సంవత్సరము మార్చి నెలలో లక్నో నగరముునను ఆంగ్లేయులు జయమునొందిరి. సిపాయిల కలహము నిర్మూల మయ్యెను.

రాజద్రోహ నివృత్తి

ఇంకముందిట్టి కలహము లెప్పుడును జరుగనీక చేయుటకై కఠినశాసన మొకదానిని ఆచరణకుఁ దేవలసినదని ఆంగ్లేయు లనేకులు అభిప్రాయ మొసంగిరి. అయినను విక్టోర్యారాణిగారు హిందూదేశ ముఖ్యపరిపాలకులైన కాన్నింగు ప్రభువుగారి ఆలోచనను అంగీకరించి సామోపాయమే చేయవలయునని నిశ్చయించిరి. మఱియు రాజద్రోహులను, స్త్రీల విషయముునను శిశువుల విషయముునను ఘోరకృత్యములను జేయువారిని, శిక్షాస్మృతి ప్రకారము దండింపవచ్చునేగాని,

కలహకారుల నణఁచుట కొరకు క్రొత్తచట్టము చేయ నక్కఱ లేదని చెప్పిరి. ఇందువలననే ఆమెకు హిందువులయెడగల విశ్వాసము స్పష్టమగుచున్నదికదా ? అప్పుడు రాణిగారు హిందువులయెడ కనఁబఱిచిన దయనుజూచి, ఆ దినము మొదలుకొని ఆమెను 'దయగలరాణి' అని ఆంగ్లేయులే చెప్పుచున్నారు.

మహారాజ్ఞిగారి రాజప్రకటనము

ఈ ప్రకటనమును 1858 వ సం. నవంబరు నెల 1 తేది అలహాబాదులో కాన్నింగు దొరగారు (రాజ ప్రతినిధి) చదివిరి.

" ఇంతవఱకును మాకొఱకై ఘనతవహించిన ఈస్టు ఇండియా (తూర్పు ఇండియా) కంపెనివారు పరిపాలించు చున్న ఇండియాదేశముయొక్క దొరతనమును, పార్లిమెంటు వారి ఆలోచనను సమ్మతిని బడసినదేగాక, మఱికొన్ని ముఖ్య కారణములవలనను, మేమే వహించుటకు నిశ్చయించియున్నాము.

" కాఁబట్టి, మీఁదఁ జెప్పిన ఆలోచనను సమ్మతిని అనుసరించి, ఆ దొరతనమును మేమే వహించినామని ఈ ప్రసిద్ధ పత్రికచేతఁ దెలియఁజేసెదము. ఆ రాజ్యములోని మా ప్రజలందఱును కృతజ్ఞులుగను, మాయందును మా

సంతతివారియందును మా యనంతరము పట్టమునకు రాఁగల వారియందును వాస్తవమైన రాజభక్తి కలవారుగ నుండ వలయును. ఆ రాజ్యముయొక్క దొరతనమును మాకొఱకు మా పేరితో పాలించుటకు మేము అప్పుడప్పుడు నియమింపఁజేయువారి యధికారమునకు లోఁబడి నడుచుకొన వలయును.

,, మాయందు విశ్వాసముగల మాజ్ఞాతియును మంత్రాలోచన సభ్యులు నైన చార్లెస్ జాన్ వైకౌంట్ కాన్నింగు అనువారియొక్క రాజభక్తియందును నేర్పునందును బుద్ధియందును పరమప్రీతియును నమ్మకము నుంచి వారిని హిందూదేశమును పాలించుటకును, మా పేరితో సకల వ్యవహారములు జరుపుటకును మాయొక్క ముఖ్యప్రతినిధి (వైస్రాయి)గా నియమించి యున్నాము. మా ముఖ్యమైన రాజాంగకార్యదర్శకులలో నొకరిమూలముగా మేము అపుడపుడు పంపునట్టి ఉత్తరవులను అనుసరించి వారు నడుచుకొందురు.

,,ప్రకృతమున ఈస్టిండియా కంపెనివారిచే నియమింపఁబడియుండు సివిల్ ఉద్యోగస్థులను మిలిటెరి ఉద్యోగస్థులను వారివారి ఉద్యోగములయందు స్థిరపఱిచెదము. ఇఁక ఆయుద్యోగస్థులందఱును మాయుత్తరవుచొప్పున ప్రవర్తింపవలసినవా రగుదురు.

"ఈస్టిండియా కంపెనివారిచేతను వారి యధికారమును బొందిన వారిచేతను చేయంబడిన ఒడంబడికలను మేము అంగీకరించినాము. ఆయొడంబడికల చొప్పుననే హిందూ దేశములోని స్వదేశరాజులును నడుచుకొందురని నమ్మెదము.

"ఇప్పుడు మాకుఁ గల రాజ్యమునకంటె ఎక్కువగా రాజ్యము కావలయునని మేము కోరలేదు. మారాజ్యమునందును స్వాతంత్రములందును ఇతరులు చొచ్చుటకు చోటీయఁజాలము. అట్లే ఇతర రాజ్యములందును స్వాతంత్రములయందును అతిక్రమించి వర్తించుటకు చోటీయఁజాలము. స్వదేశరాజులయొక్క బాధ్యతలకును గౌరవములకును భంగము కలుగఁజేయము. రాజ్యము నెమ్మదిగా నున్నందులుబట్టి మంచిదొరతనమువలనఁ గలుగఁగల అభివృద్ధిని లోకక్షేమమును ఆ స్వదేశరాజులును మా సొంతప్రజలును అనుభవింతురని కోరెదము.

"మాయొక్క ఇతర ప్రజలయెడల మేము ఏరాజధర్మము ననుసరించి వర్తించుచున్నామో, ఆరాజధర్మము ననుసరించియే హిందూప్రజలయెడలను వర్తింపఁ గలవారము. ఆధర్మములను దైవానుగ్రహమువలన మన స్వాస్థ్యకి విరోధములేక నెఱవేర్పఁ గలము.

,,క్రీస్తుమతముయొక్క సత్యమును దృఢముగా నమ్మి యున్నాము; ఆమతమువలనఁ గల్గిన చిత్తశాంతిని కృతజ్ఞతతో నంగీకరించెదము. అయినను, మా మతవిశ్వాసములను మా ప్రజలును అనుసరింపవలయునని మేము ఎంత మాత్రమును నిర్బంధము చేయము. అట్టి కోరికయు మాకు లేదు. ప్రజలు తమతమ మతవిశ్వాసములనుబట్టిగాని ఆచారములను బట్టి గాని ఒకరిపై నొకరు ద్వేషము వహించుటయు, లాభమును పొందుటయు తగదు. అందఱును ఒకే విధముగా రాజ శాసనమునకు లోఁబడి నడుచుకొనుచుండవలయునని మేము నిష్పక్షపాతముగాఁ జెప్పుచున్నాము. మాక్రింది ఉద్యోగస్థు లును ఎవరిమతమునందుఁగాని ఎవరి దేవపూజా విధానము నందుఁగాని ఏవిధమైన సంబంధమును కలుగఁజేసికోరాదని యును, అట్లు కలుగఁజేసికొనినవారు మా యాగ్రహమునకు పాత్రులగుదురనియును దృఢముగా విధించుచున్నాము.

,,మా ప్రజలు ఏకులస్థులైనను ఏ మతస్థులైనను సరియే వారు విద్య, యోగ్యత మొదలగు సుగుణములు గలవారై యుందురేని, వారివారి సామర్థ్యమునకుఁ దగిన ఉద్యోగము లొసంగఁబడును.

,,హిందువులు తమ పెద్దలనాఁటినుండి పరంపరగా వచ్చిన భూముల విషయమునందు వారుంచియుండు అభిమాన మిట్టి దని మాకుఁ దెలియును. ఆయభిమానమును మేము వృద్ధి

చేయుదుము. మఱియు ఆభూముల సంబంధమైన బాధ్యతలను న్యాయమైన రాజాంగపద్ధతిచొప్పున కాపాడుటకు కోరెదము. చట్టములను ఏర్పఱుచుటయందును వానిని పాలించుటయందును హిందువులయొక్క పూర్వాచారములకు విరోధములేక గమనించి అమలులోనికిఁ దేవలయుననియే మాకోరిక.

"పేరాసచేత కొందఱు కావించిన కలహములవలన హిందూదేశవాసులకుఁ గల్గిన కష్టములను గూర్చి మేము చాలా చింతించెదము. ఇట్టి కలహకారులను అణఁగద్రొక్కి ఋజుమార్గమున ప్రవర్తించువారు మాదయను బడయఁగలరు.

"దేవుని కృపచేత దేశమునందు మఱల నెమ్మదికల్గినప్పుడు హిందూదేశమునందు చేతిపనులు మొదలగు దేశక్షేమ కార్యములను వృద్ధిచేసి లోకులకు లాభము కలుగఁజేయవలయునని కోరియున్నాము. ప్రజలయొక్క సంపదయే మాయొక్క బలము; వారియొక్క సంతోషమే మాయొక్క క్షేమము; వారి కృతజ్ఞతయే మాయొక్క ప్రతిఫలము. ఈ మాతలంపును మాక్రింది యుద్యోగస్థులును గమనింపవలయును, ఈ మా యభీష్టమును దేవుఁడు నెఱవేర్చును గాక!"

ఈ ప్రకటనమువలననే విక్టోర్యారాణిగారికి హిందువులపట్లగల సదయభావము వేద్యమగుచున్నది.

కోబర్గులో ఆపద

1860 వ సంవత్సరము ఆగస్టునెలలో విక్టోర్యా రాజ్ఞిగారు స్కాట్లండు దేశమునకుఁ బోయి వచ్చిరి. మఱి కొన్నిదినములకంతయు మహారాజ్ఞిగారును ఆల్బర్టు ప్రభువుగారును కోబర్గు నగరమునకు పోయిరి. అచ్చట ఆల్బర్టుప్రభువుగారు గుఱ్ఱపుబండినెక్కి స్వారిచేయఁ బోయినపుడు ఆగుఱ్ఱము బెదరి అతివేగముగా పఱుగిడెను. ఇట్లు పోవునపుడు రైలు మార్గమున కడ్డముగాఁబోవు బాటయొక్క తలుపులు మూసియుండెను. ఈబండి ఆతలుపులలో మోదునని తలంచి ఆల్బర్టు ప్రభువుగారు నేలపై నురికిరి. అందువలన శరీరమునందు కొన్నిచోటులలో గాయములు కల్గెను. బండితోలువాఁడు క్రిందికి దుముకనందున వానికి బలమైన గాయములు కలిగెను.

కెంటుప్రభ్వి మరణము

1861 వ సంవత్సరము మార్చినెలలో విక్టోరియా మహారాజ్ఞిగారి తల్లియగు కెంటుప్రభ్విగారు మరణము నొందిరి. ఇదివఱ కెన్నిమాఱులో రాణిగారిని చంపుటకు దుర్మార్గులు ప్రయత్నించిరికదా? అపుడంతయు నామెకు ఎంతమాత్రమును వ్యసనము కలుగలేదు. రాణిగారు తమతండ్రి చిన్ననాఁటనే గతించినను, తల్లి యగు కెంటుప్రభ్వి తమయొక్క అభివృద్ధికొఱకు పడినపాటులన్నియు ఆవేళ జ్ఞప్తికి వచ్చెనుఁ

ఆమె తమ యున్నతపదవినంతయు మఱచిపోయి మిగుల దుఃఖించిరి, చింతించిరి, పరితపించిరి, శోకించిరి. రాణిగారికి తల్లియెడల మిక్కిలి ప్రేమయు గౌరవమును కలదు. ఒక్కొ-క్క విషయమును తల్లితోఁ జెప్పుచుండిరి. తల్లియొక్క సదుప దేశము ఆమెకు మేలొనఁగూర్చుచుండెను. కాఁబట్టి అట్టి తల్లిని పోఁగొట్టుకొనినందులకు మిగుల విచార మొందిరి. ఎట్టి మహోన్నత పదవి యున్న నేమి? తల్లితో నేదిసమానము?

ఆల్బర్టు ప్రభువుగారి మరణము

ఎట్టివారి కైనను ఈ భూలోకమునందు ఆపదలు సంభవించుటకు ప్రారంభించినయెడల ఒకదానిపై నొకటి వచ్చుచుండును. అట్లే రాణిగారికిని సంభవించినది. 1861 వ సంవత్సరము నవంబరు నెల 22 తేది ఆల్బర్టుప్రభువుగారు సాండ్ హర్స్ట్ అనుచోటికిఁ బోయి అచ్చట నూతనముగా స్థాపింపఁబడిన సైనిక కళాశాలను చూచివచ్చిరి. ఆదినము వాన కురిసినందువలన ఆల్బర్టు ప్రభువుగారికి జలుబు చేసెను. అప్పటికి కొలఁది దినములకు ముందుగా పోర్తుగల్ దేశపు రాణియును ఆకుటుంబములోఁ జేరినవారిలోఁ గొందఱును జ్వరముచే గతించినందున, ఆల్బర్టు ప్రభువుగారు వారివిషయమై చాల చింతించుచుండిరి. అదిమొదలు వారికి శరీరము అస్వస్థతగా నుండెను. అనంతరము జ్వరము వచ్చెను. మహారాజ్ఞిగారు భర్తయొక్క అనారోగ్యస్థితికై మిగుల

వ్యసన మొందుచుండిరి. అనేకులు వైద్యులు ఔషధము లొసంగి ధైర్యము చెప్పుచుండిరి. అయినను ఆల్బర్టుగారు తమయొక్క రోగమునకు భయపడలేదు. ఆయన మిగుల దైవభక్తిగల వారుగావున, వారు దేవునినే స్మరించుచుండిరి. వారు గతించుటకు కొన్ని దినములకుముందు విక్టోరియారాణిగారిని బిలిచి యిట్లనిరి — "ప్రాణమును నేను ఘనముగా నెంచలేను. నేను ఎవరెవరియందు వాత్సల్యము నుంచి యున్నాడనో వారందఱును క్షేమముగా నుండుటయే నాకు చాలును. నేను గతించుటకు సిద్ధముగా నున్నాడను" అనిరి. ఈమాటలును వినినదిమొదలు రాణిగారికి మఱింత దుఃఖమయ్యెను. ఆల్బర్టు ప్రభువుగారికి రోగము నానాఁట యధికమైనది. అనంతరము ఆల్బర్టుగారు తమకనంతరము చేయవలసినదానినిగూర్చి చెప్పిరి. 1861 వ సంవత్సరము డిసంబరు నెల 14 తేది రాత్రి పదిగంటలకు ఆల్బర్టు ప్రభువుగారు పరలోకమున కేఁగిరి.

మహారాజ్ఞిగారు చాల వ్యసనమొందిరి. ఆమెకు భర్తయందుఁగల ప్రీత్యతిశయముచేత ఆయన గతించిన మూఁడు దినములవఱకును మిగుల జబ్బుస్థితిలో నుండిరి. రాణిగారును దేహమును చాలింతురో యేమో యని తలంచిరి. ప్రాణనాయకునియెడల పత్నికిఁగల విశ్వాసమును జూచి ఆశ్చర్యమొందిరి. డిసంబరు నెల 23 తేది ఆల్బర్టు ప్రభువుగారి శవమును రాజగౌరవముతోఁ గొనిపోయి సమాధి చేసిరి.

మహారాజ్ఞిగారికి తమ నాయకునియెడల మిగుల విశ్వాసము కలదు. ఆమె ఎప్పుడును భర్తను ఎడఁబాసి యుండినది లేదు. ఒకప్పుడు ఆల్బర్టు ప్రభువుగారు రాణిని విడిచిపెట్టి లివర్పూలునకు రెండుదినములు పోయియుండిరి. అపుడు ష్టాక్మారు దొరగారి పేర దిగువ నుదహరించినట్లు ఒక జాబు వ్రాసిరి — "నాప్రియతముఁడైన భర్త యింటలేనందున నేను అసహాయనై యున్నాను. ఇతర దంపతులు పలుమాఱు ఒండొరులను వదలిపెట్టి చాలదినము లుండెదరు; ఆయనను రెండుదినములు వదలియుండుటయే నాకమితవేదనగానున్నది. ఆయన కనంతరము నన్ను బ్రతికింపకుండుటకై నేను దేవుని స్తోత్రము చేసెదను. అతఁడు నిరంతరము నాకన్నుల కగపడుచుండి నన్ను ప్రేమించుచుండుటయే నాపుణ్యము"

ఇందువలననే రాణిగారికి భర్తయెడలగల ప్రీతి యిట్టిదని స్పష్టముగాఁ దెలియుచున్నది కదా? పతివ్రతల ధర్మ మిట్టిదయని వేఱుగాఁ జెప్పవలయునా?

విక్టోర్యా మహారాజ్ఞిగారు తమ వివాహమైన ఇరువదియొకటవ సంవత్సరపు మహోత్సవమును ఆ 1861 వ సంవత్సరముననే చేసికొనిరి. ఆ మహోత్సవమైన మఱునాఁడు రాణిగారు, బెల్జియము దేశాధిపతియు మేనమామయు నగు లియోపాల్డురాజుగారికి దిగువ నుదహరించిన విధముగా వ్రాసియున్నారు.

"లోకములో వివాహకాలమున నాభర్త నాయెడల నెట్టి ప్రియము నగపఱిచిరో అది క్రమముగా వృద్ధినొందు చుండినది. నాయొక్క వివాహమైనదిమొదలు ఈ యిరువది యొకటవ సంవత్సరముదాఁక నాయందు వారు విశేషమైన విశ్వాసము నగపఱచు చున్నారు."

ఇంతటి విశ్వాసముగల భర్తను పోఁగొట్టుకొనినట్టి రాణిగారియొక్క చిత్త మెట్లు తత్తరిల్లుచుండెనో యది దేవుఁడే యెఱుఁగఁగలఁడుగాని వ్రాయ నలవికాదు.

ఆల్బర్టుప్రభువుగారు చాల మంచిగుణము గలవారు. ప్రజలయందు మిక్కిలి కరుణగలవారు. ఆయన వివాహమైన పిదప ఇంగ్లండులోనే నివసించి ఆంగ్లేయభాషను వృద్ధిచేసి కొని రాజ్య వ్యవహారములకు వలయు శాసనము లాదిగాఁ గల వానినెల్లను జదివి సమర్థులైరి. వారు ఇంగ్లీషులో మొట్ట మొదట 1840 సంవత్సరమునందు బానిస వ్యాపారము మాన్పవలయునని ప్రసంగము కావించిరి. అనఁగా ప్రజల క్షేమమునే సదా వారు కోరుచుండిరని వేద్యమయ్యెడిని.

రాణిగారి ఔదార్యము

రాణిగారు తమ భర్త గతించిన దుఃఖమున మునిఁగి చింతించుచుండు సమయముననే యొకచోట బొగ్గుగని కూలి వాలమంది గతించిరి. ఆమాటను విన్నంతనే ఆమె చాల

పరితపించి గతించినవారి బంధుమిత్రాదులకు ఊరట వాక్యములను తంతీద్వారా తెలియఁజేసి వారి సహాయమునకై రెండువేల రూపాయలను బంపిరి.

ఆల్బర్టుప్రభువుగారి సమాధిస్థానము

విక్టోర్యా రాణిగారు తమభర్తయొక్క సమాధిని సంవత్సరములోపలనే తమ సొంతధనములోనుండి ఇరువది లక్షల రూపాయలు వ్యయముచేసి నిర్మించిరి.

1862 వ సంవత్సరము డిసంబరు నెల 14 తేది భర్తయొక్క సాంవత్సరికమునాఁడు రాణిగారు తమ బిడ్డలతోఁ గూడి సమాధియొద్దకేఁగి స్తోత్రములుచేసి వచ్చిరి.

వేల్సుప్రభువు వివాహము

విక్టోర్యా రాణిగారి జ్యేష్ఠపుత్రుఁడును యువరాజును వేల్సుప్రభువును అగు ఎడ్వర్డుగారు 1863 వ సంవత్సరము మార్చినెల 10 తేది డెన్మార్కు రాజు కూఁతురైన అలెగ్జాండ్రా ప్రభ్విని పెండ్లియాడిరి. అలెగ్జాండ్రా ప్రభ్విగారును ఆమె తలిదండ్రులును తోఁబుట్టువులును పరిజనమును డెన్మార్కు దేశమునుండి మార్చినెల 7 తేది లండను నగరమును జేరిరి. ఈ వివాహ మహోత్సవము అత్యద్భుతముగా నుండెను. ఇంతటి వైభవముతో నెవ్వరికిని అదివఱకు వివాహము జరుగలేదు. పలుదేశములయందుండి వివిధములైన రత్నాభరణ

ములును ఇతర బహుమానములును వచ్చినవి. లండన్ నగర మంతయు అలంకరింపఁబడెను. వివాహమహోత్సవము ననుసరించి స్వదేశస్థులకును విదేశములందుండి వచ్చినవారికిని విందులు మొదలగు వివిధసత్కారములు కావింపఁబడెను.

మహారాజ్ఞీగారికి ఆపద

1863 వ సంవత్సరము మేనెల మహారాజ్ఞిగారు తమ కొమార్తయగు ఆలీస్ ప్రభ్విగారితోఁగూడి నెట్లి అనుచోట నిర్మింపఁబడియుండు సైనిక వైద్యశాలకుఁ బోయి అచ్చట బాధపడుచుండిన యుద్ధభటుల నోదార్చి, అచ్చటనుండి బయలువెడలి ఆగష్టునెల బెల్జియమునకుపోయి మేనమామయగు లియోపాల్డుగారింట కొన్నిదినములు నివసించియుండి, ఆఁమీఁద జర్మనికిఁబోయి కొన్నాళ్లు నివసించియుండి మరలి వచ్చి, బాల్మోరల్ భవనంబును జేరిరి. అచ్చట నున్నపుడు రాణిగారును ఆలిస్ప్రభ్వియును హెలినాప్రభువును బండి నెక్కి విహరించుటకేఁగఁగా, ఆబండి తలక్రిందులైపడెను. అందఱును నేలపైఁబడిరి. అపుడు రాణిగారికి మాత్రము మొగమునందు కొన్ని గాయములు కల్గినవి.

ఆల్బర్టుప్రభువుగారి విగ్రహ ప్రతిష్ఠ

అనంతరము కొన్నిదినములకు పిమ్మట అబర్డీన్నగరమునందు ఆల్బర్టు ప్రభువుగారి విగ్రహమును ప్రతిష్ఠచేసిరి. అందు

లకు విక్టోర్యారాణిగారు తమ కొమారులు కొమార్తెలతో అచ్చటికిఁ బోయియుండిరి. రాణిగారిని జూచుటకొఱకును ఆమె భర్తయొక్క విగ్రహప్రతిష్ఠామహోత్సవమునకును అనేక జనులు గుమిగూడి యుండిరి. అంతయును రాణిగారి భర్తయగు ఆల్బర్టుప్రభువుగారి మరణమునకు చింతిల్లి రాణిగారికి తమ అనుతాపమును దెలియఁజేసిరి.

ప్రధానమంత్రి మరణము

1866 వ సంవత్సరమునందు లార్డు పాల్మర్‌స్టన్ అను ప్రధానమంత్రి తమ ఎనుబదియవయేఁట గతించిరి. ఆయన మహాసమర్థుఁడును రాజకార్య ధురంధరుఁడునై యుండెను. మహారాజ్ఞిగారు ఆయనశవమును వెస్టు మినిస్టర్ ఆబియందు సమాధి చేసిరి. ఆయనకు పిమ్మట ఎర్ల్ రసల్ అనువారు ప్రధానమంత్రిపదమును వహించిరి. ఆసంవత్సరముననే ప్రసిద్ధుఁడైన రిచ్చర్డ్ కాబ్డన్ అనువాఁడును మృతినొందిరి. ఈయిర్వురి మరణమునకును రాణిగారు చాల పరితపించిరి.

బీబాడి పరోపకారము

బీబాడి అను పేరుగల అమెరికా వర్తకుఁడు మహాధనికుఁడుగా లండన్ నగరమున వసించి యుండెను. ఆయన విక్టోర్యారాణిగారితో ఆలోచించి ఆమె అనుమతినొంది బీదలకు కొన్ని ధర్మకార్యములు చేయుటకు సంకల్పించెను. ఆయన

1862 వ సంవత్సరము మొదలు గతించు కాలమువఱ కును తమకుఁగల ఆస్తిలో కొంతకొంతగా అపుడపుడు ఇచ్చు చుండెను. ఇట్లు అతఁడిచ్చిన ధనము ఏఁబదిలక్షల పౌనులు. ఈ ధనముతో బీదలకు కూలివారులకు వసించుటకు గృహములు నిర్మింపఁబడినవి. సారాయి మొదలగు మత్తుపదార్థముల సేవనము నిల్పుటకొఱకు అనేక సభలు స్థాపింపఁబడి, ఆపదార్థ ములవలని చెడుగును తెలియ చేయుటకై అనేక పత్త్రికలును గ్రంథములును ప్రకటింపఁబడినవి. ఇంకను లోకక్షేమార్థ మునకు వలయు నెన్నియో కార్యములు చేయఁబడినవి. ఈ విధములగు సత్కార్యములను వృద్ధికిఁ దెచ్చునట్టి విషయము నందు రాణిగారును చాల శ్రద్ధ పుచ్చుకొనిరి. ఏకార్యమును దేశ పాలనాధికారుల అనుమతియు అనుగ్రహము లేనిది జరు గదుకదా.

లియోపాల్డుప్రభువు మరణము

1865 వ సంవత్సరము డిసంబరునెల 9 తేది రాణిగారి మేనమామగారైన లియోపాల్డు ప్రభువుగారు తమ డెబ్బ దియాఱవ సంవత్సరమున మృతినొందిరి. ఈవార్తను విని రాణిగారు మిగుల దుఃఖించిరి. ఈయన రాణిగారి అభివృద్ధి విషయమై మిగుల శ్రద్ధపుచ్చుకొని యుండినవారు. మఱియు రాణిగారు ఏకార్యమునుగాని మేనమామగారిమాట నతి క్రమించి జరపినది లేదు. ఆయనవంటి ఆప్తబంధువును

అంతరంగికమంత్రియును రాణిగారికి వేఱెవ్వరును లేరు. కాఁబట్టి యిట్టిస్థితియందు రాణిగారి హృదయవేదన యెట్లుండునో యది చదువరులే యూహించి తెలిసికొందురుగాక.

పలువిధములగు కష్టములు

1866 వ సంవత్సరమునందు లండన్ నగరమునందలి హైడ్ పార్కు అనుచోట గొప్ప కలహము జరిగెను. ఆ కలహము మిగుల తంత్రముగా నాఁపివేయఁబడినది. ఆసంవత్సరమున వర్షాభావముచేత కఱవు సంభవించెను. జనులు అన్నములేక మలమల మాఁడుచుండిరి. అనేకులకు పనులు దొరకకపోయెను. దీనికి తోఁడుగా విషూచి (కలరా) మొదలగు వ్యాధులు సంభవించి అనేకులను పరిసమాప్తి కావించెను. ఆసంవత్సరముననే ప్రష్యావారును ఇటాలియావారును ఒకటిగాఁ జేరి ఆస్ట్రియా దేశముపై దాడివెడలి మహాయుద్ధముచేసిరి. పిమ్మట ఆస్ట్రియావారు యుద్ధమును చాలించి సమాధానము చేసికొనిరి. ఆసంవత్సరముననే అమెరికా దేశమునకు లండన్ నగరమునుండి సముద్రమార్గముగా తంతి వేయఁబడినది.

ఆల్బర్టు హాల్

1867 వ సంవత్సరము మేనెల 20 తేది ఆల్బర్టు హాల్ అను మందిరముయొక్క ప్రవేశ మహోత్సవము మహావైభవ

ముగాఁ గావింపఁబడినది. ఆమందిరమును రాణిగారు తెఱచిరి. అది రాణిగారి భర్తయొక్క జ్ఞాపకార్థమై నిర్మింపఁబడినది.

తుర్కీ సుల్తాన్ గారు

1867 వ సం. జూలై నెలలో తుర్కీదేశపు సుల్తాన్ గారు లండన్ నగరమునకువచ్చి విక్టోరియాగారి అతిథిగా నుండి తమయొక్క రాజాంగసంబంధమైనట్టి పలువిషయములను ముచ్చటించి వెడలిపోయిరి.

ఐర్లాండు కలహము

ఐర్లాండు దేశమునందు కొందఱు కలహకారులు సంఘముగా చేరి రాజద్రోహముచేయ నారంభించిరి. ఈసంఘముయొక్క కలహకారులను చాలజాగ్రత్తతో కనిపట్టి 1867వ సం. సెప్టంబర్ నెల 18 వ తేది పట్టుకొని చెఱయందుంచుటకు ప్రయత్నింపఁగా ఐరిష్ జనులు గుమిగూడివచ్చి కలహముచేసి ఆనేరస్థులనందఱను విడిపించిరి. అందువలన ఇంగ్లండులోను విశేషమైన కలహము సంభవించెను. పిమ్మట కలహకారులలోఁ గొందఱనుపట్టి చెఱయం దుంచిరి. ముగ్గురకు మరణదండన విధింపఁబడెను. చెఱసాలలోనున్న ఐరిష్ వారిని విడిపించుటకై ఐరిష్ జనులు తుపాకిమందు పెట్టి చెఱసాలను కాల్చివేసిరి. అందువలన చాలానష్టము సంభవించెను. పన్నిద్దరు పరలోకమేఁగిరి. నూటయిరువండ్రకు బలమైన గాయములు కలిగినవి.

పిమ్మట, ఈదుర్మార్గులు రాజశాసనముప్రకారముగా శిక్షింపఁబడిరి.

అబ్సీనియా కలహము

అబ్సీనియా అనునది ఆఫ్రికాఖండములోని ఒక చిన్న దేశము. అపుడు ఆదేశమును తియోడోర్ అనునతఁడు పాలించుచుండెను. ఆయన ఒక కాగితమును రాణిగారికి వ్రాసెను. అందులకు వెంటనే బదులీయలేదు. ఆరాజు ఆలస్యమునకు కారణమైనను అడుగక కుపితుఁడై ఆదేశమున వసించు ఆంగ్లేయులను చెఱయం దుంచెను. ఈసంగతి లండన్ నగరమునకు దెలిసినమీఁదట ఆంగ్లేయరాజాంగమువారిచే, చెఱలోనున్నవారిని విడిచిపుచ్చుటకును, తియోడోరును దండించుటకును, ఇండియానుండి అబ్సీనియా దేశమునకుఁ ఒక బ్రిటిష్ సేన పంపఁబడెను. ఆసైన్యమునకు సర్ రాబర్టు నేపియర్ నాయకుఁడుగా నుండిరి.. సైన్యము తనపైకి వచ్చుచున్నదని తెలియఁగానే తియోడోర్ ఎదురించి యుద్ధముచేయుటకు చేతఁగాక మక్డాలా అనెడి గిరిదుర్గమునకు పఱుగిడి పోయెను. ఆపర్వతముయొద్ద యుద్ధము జరిగెను. ఆయుద్ధమునందు తియోడోర్ గతించెను. అతని సైన్యమును నాశమొందెను. పిమ్మట ఆ తియోడోర్ కుమారుని లండన్ నగరమునకుఁ దోడ్కొని వచ్చి, రాజాంగమునకువలయు యోగ్యతగలవానిగాఁ జేసి, యతనిని అబ్సీనియా దేశమునకు రాజుగా నియమించిరి.

జర్మన్ యుద్ధము

1870 వ సంవత్సరమునందు ఫ్రాన్సు దేశమునకును జర్మన్ దేశమునకును యుద్ధము జరిగెను. ఫ్రాన్సుదేశము సంపూర్ణముగా జయింపఁబడెను. మఱియు ఫ్రాన్సుదేశాధిపతిగారు సెడాన్ యుద్ధమునందు జర్మన్ వారి చేతికిఁ జిక్కి చెఱయందుంపఁబడిరి. ఈవృత్తాంతము పారీసునగరమునకుఁ దెలిసిన వెంటనే మఱల ఫ్రెంచివారు గొప్ప కలహము చేయఁదొడంగినదేగాక తమ ఫ్రాన్సుదేశమును ప్రజాధిపత్య దేశముగాఁ జేసిరి. ఫ్రాన్సురాణిగారు మాఱువేషముదాల్చి లండన్ నగరముపోయి చేరిరి. ఆ పిమ్మట ఫ్రాన్సురాజును మాఱువేషమును ధరించి లండన్ పట్టణమును జొచ్చిరి. అనంతరము జర్మన్ సైన్యము పారీసునగరమును ముట్టడించెను. కడపట ఫ్రెంచివారు జర్మన్ వారికి అల్ చేస్ మాగాణమును, లొరైయిన్ మాగాణములో కొంతభాగము నిచ్చినదేగాక, యుద్ధనష్టమునకై అమితమైన ధనమునుకూడా ఇచ్చి సమాధానము చేసికొనిరి.

వేల్సుప్రభువుగారికి రోగము

1871 వ సంవత్సరము యువరాజుగారైన వేల్సుప్రభువుగారికి జ్వరము వచ్చెను. అది క్రమక్రమముగా బలపడినది. మహారాజ్ఞిగారు చాల వ్యసన మొందిరి. వ్యాధి కుదురకయే యున్నందున వైద్యులుకూడా సందేహించిరి. పిమ్మట దేవు

నిపై భారమువేసి దేవాలయములయందెల్ల ప్రార్థనలు సల్పిరి. తర్వాత క్రమక్రమముగా వ్యాధి నిమ్మళింపఁ దొడంగెను. డిసంబరు నెల 18వ తేది మొదలు ఆరోగ్యము నొందుచు వచ్చిరి. డిసంబరు 26వ తేది మహారాజ్ఞిగారు, తమకొమారుఁడు సౌఖ్యమొందుటకై ప్రజలు దేవతాప్రార్థనలు మొదలుగునవి సల్పి తమయనుతాపమును వెలిబుచ్చినందులకై, ప్రజలయెడ తమకుగల ప్రీతిని ప్రకటనద్వారా తెలియఁబఱిచిరి. యువరాజుగారికి సంపూర్ణముగా ఆరోగ్యము కల్గిన తర్వాత సెయింట్ పాల్ చర్చిలో విశేషప్రార్థన సలుపఁబడెను. అందులకు రాజకుటుంబములోనివా రందఱును దేవాలయమున కేఁగిరి. ఆదినము లండన్ నగరమంతయు శృంగారింపఁబడెను. ప్రజలందఱును తమసంతోషమును ప్రకటించుచు ఆనందించిరి. ప్రజలకుఁగల రాజభక్తిని జూచి విక్టోర్యారాణిగారు చాల సంతసించిరి.

రాణిగారికి ఆపద

1872 సంవత్సరము ఫిబ్రవరి నెలలో నొకనాఁడు విక్టోరియా రాణిగారు విహారార్థమై బయటపోయి మఱలి వచ్చునపుడు పదునేడేండ్ల వయస్సుగల ఆర్థర్ ఓకాన్నర్ అనెడి ఐరిష్‌వాఁ డొకఁడు కుడిచేతిలో నొకతుపాకిని, ఎడమచేతిలో నొక విజ్ఞాపనపత్త్రికను ఉంచికొనివచ్చి రాణిగారిపై తుపాకిని ప్రయోగించుటకు గుఱిచూచుచుండఁగా రాణిగారి సేవ

కులలో ముఖ్యుఁడు జాక్ బ్రాక్ అనువాతఁడు ఆబాలుని పట్టుకొనెను. తుపాకిని శోధించిచూఁడగా అందు ఉత్త మందు మాత్రమే యుండెనుగాని గుండు లేదు. అయినను వానియొద్ద ఒక కత్తి యుండెను. పిమ్మట వానికి కొన్ని దెబ్బలశిక్షను ఒక సంవత్సరము కారాగారవాసశిక్షను విధించిరి.

అషాంటి యుద్ధము

పశ్చిమ ఆఫ్రికాయందు గోల్డుకోస్టు మాగాణమున బ్రిటిషువారి సరిహద్దుల కావలనుండు ప్రదేశములందు అచ్చటచ్చట అషాంటిస్ అనెడి జాతివా రున్నారు. వారు చాలా అనాచారపరులు. వారెప్పుడును కలహప్రియులు. జగడమే వారివృత్తి. 1873 సంవత్సరమునందు వారు పిరానదిని దాఁటి ఎల్మినా నగరమునకుఁ బోయి అచ్చటనుండు ఆంగ్లేయుల సైన్యమును ఎదురించిరి. బ్రిటిష్‌వారు వారిని కొట్టి తఱిమిరి గాని, అచ్చటచ్చటకలహములుజరుగుచునేయుండెను. పిమ్మట అషాంటివారు ప్రతియుద్ధమునను అపజయమును బొందుచు తుదకు తమ ప్రధాననగరమైన కూమాసికి పోయి చేరిరి. ఆమోబుల్ అనుచోట ఇరుతెగలవారికిని ఘోరయుద్ధము జరిగెను. ఆ యుద్ధము ఒకటే విధముగా పండ్రెండు గంటలసేపు జరిగినది. బ్రిటిష్ వారు ఆనగరమును స్వాధీనము చేసికొని అచ్చటనుండి ఆర్డానదినిదాఁటి కూమాసికి పదిమైళ్ల దూరమునవచ్చి విడిసిరి. అచ్చటికి అషాంటిజనులు సుమారు

పదివేలమంది వచ్చి జగడము చేసిరిగాని తుదకు వారు పరాజితులై కూమాసికి పాఱిపోయిరి. అయినను రాజును ఇతర ముఖ్యులును ఆనగరమునువదలిపెట్టిపోయి ఎచ్చటనో దాఁగి యుండినందువలన, బ్రిటిష్ యోధులు ఆనగరమును అగ్నిదేవున కర్పణముచేసి వెడలిపోయిరి.

యువరాజుగారు ఇండియాకు వచ్చుట

1875 వ సంవత్సరము అక్టోబరు నెలలో వేల్సు ప్రభువుగారు లండన్ నగరమునుండి ఇండియాకు ప్రయాణముచేసిరి. వారు మొదట బొంబాయి చేరిరి. పిమ్మట పునానగరమును బరోడాసంస్థానమును జూచికొని, అచటనుండి సిలోన్ చేరిరి. సిలోనునుండి మధుర, తిరుచినాపల్లి, మద్రాస్ (చెన్నపట్టణము) చూచికొని, ఓడనెక్కి కలకత్తా (కాళీఘట్టము) చేరిరి. అచ్చటనుండి బయలువెడలి ప్రసిద్ధనగరము లన్నిటిని పోయిజూచిరి. యువరాజుగారు పోయినప్రదేశములయందెల్ల జనులు మిగుల సంతోష మొందినవారైరి. వారు పోయిన పట్టణము లన్నియు శృంగారింపఁబడెను. రాజభక్తి సూచకముగా అచ్చటచ్చటఁగల ప్రముఖులు అనేక సత్కార్యములను చేసిరి. ఒక్కొకచోటను అభివందనపత్రికలు చదువఁబడినవి. స్వదేశరాజులును స్వదేశాభిమానులగు ధనవంతులు మొదలగువారును వివిధము లగు వేడుకలుచేసి యువరాజుగారిని గౌరవించిరి. మఱియు రాజులు వారి వారి పిరి

వారములో నెదురేఁగి తోడ్కొనివచ్చి నగరప్రదక్షిణము కావించిరి. అనేకములగు కానుక లొసంగిరి. ఆ రాజపూజయు రాజోపచారమును రాజభక్తియును వేల్సుయువరాజు గని మిగుల సంతసించిరి. హిందూదేశములోని అడవులలో యువరాజుగారు వేఁటాడిరి. వేల్సుప్రభువుగారు ఇండియాను చూచికొని మిక్కిలి సంతోషముతో 1876 వ సంవత్సరమున ఇంగ్లండు చేరిరి.

ఇండియా చక్రవర్తిని

1877 వ సంవత్సరము జనవరి నెల 1 వ తేది విక్టోర్యా మహారాజ్ఞిగారు హిందూదేశచక్రవర్తిని అనెడి బిరుదమును వహించినట్లుగా డిల్లీనగరములోఁ గూడిన మహాజనసభయందు అప్పటి వైస్రాయియగు లార్డు లిట్టను ప్రభువుగారిచేఁ బ్రకటింపఁబడెను. ఈసభకు హిందూదేశములోఁగల స్వదేశరాజులును ఇతరప్రముఖులును పెద్దయుద్యోగస్థులును బోయి యుండిరి. ఇట్టి సభను ఆవఱకెప్పుడును ఎవ్వరును జూచినది లేదు. సకలమైనవారికిని సత్కార్యములు చేయఁబడినదే గాక, స్వదేశరాజులు మొదలగువారు తమకుఁగల రాజభక్తిసూచకముగా పలువిధములగు బహుమానవస్తువులను చక్రవర్తినిగారికి కానుకగా సమర్పించిరి.

తుర్కీయుద్ధము

ఇంగ్లండుదేశమున కలహము లేకపోయినను ఇంగ్లండునకు తూర్పున కలహములు జరుగుచుండెను. యిరోపా తుర్కీయం దొకభాగమైన బల్గేరియాయందు రష్యావారి బోధన వలన గొప్పకలహము సంభవించెను. తుర్కీ గవర్నమెంటు వారు కలహనివృత్తికై చాల ప్రయత్నించిరిగాని, ఆ దుర్మార్గులు వినక చెలరేఁగు చుండిరి. ఆసమయమును కను పెట్టి రష్యా ఉద్యోగస్థులు కొందఱు సెర్వియా దేశమునందుఁ బ్రవేశించిరి. పిమ్మట సెర్వియా దేశస్థులును మాంటినీగ్రో దేశస్థులును జేరి తుర్కీని ముట్టడించిరి. 1876 వ సంవత్సర మునందు రష్యావారును తుర్కీని జయించుటకై యొక సేనను బంపియుండిరి. తుర్కీసేనాధిపతి యైన ఉస్మాన్ పాదుషా మిగుల శౌర్యముతోను యుక్తితోను రష్యా వారిని యెదిర్చి యుద్ధము చేసెను. రష్యాదేశమువారును, సెర్వియా దేశమువారును, మాంటినీగ్రో దేశమువారును, రొమేనియా దేశమువారును ఒకటిగాఁ జేరినందున తుర్కీ వారు అపజయము నొందిరి. అనంతరము రష్యావారు తుర్కీయొక్క ప్రధాన నగరమైన కాన్‌స్టాంటినోబిల్ చేరిరి. ఈలోపల ఆంగ్లేయసైన్యము అచ్చటికి పోయి చేరినది. పిమ్మట రష్యావారు ఇఁక జయింప సాధ్యము కాదని తలంచి ఆంగ్లేయులతో సమాధానము చేసికొని వెడలిపోయిరి.

ఆఫ్గనిస్థాన యుద్ధము

చాలకాలమునుండి ఆఫ్గనులకును ఆంగ్లేయులకును గల రాజాంగ వ్యవహారము లంతగా అనుకూలముగ నుండ లేదు. అయినను అప్పుడు ఆఫ్గనిస్థానపు అమీరైన షేర్ ఆలి అను నతనికి ఆంగ్లేయులు అమితమైన యుద్ధసాధనముల నిచ్చియుండిరి. ఆఫ్గనిస్థానపు ఉత్తరప్రాంత్యమునందు రష్యావారు నివసించి యుండిరి. షేర్ ఆలి రష్యావారికి భయపడి వారితోఁ జేరెను. ఈసమాచారము తెలిసినపిదప, ఇండియా గవర్నర్ జనరల్‌గారు, మేజర్ కవాగ్నారి అను వారిని కాబూలుకు పంపించి యుండిరి. అయినను ఆఫ్గనులు మేజరును అడ్డగించి మఱలిపోవునట్లు చేసిరి. కాఁబట్టి ఆంగ్లేయులు ఆఫ్గనులతో యుద్ధముచేయవలసివచ్చినది.

1878 వ సం. నవంబరునెల 21వ తేది బ్రిటిష్ సైన్యము ఆఫ్గన్ దేశములోఁ బ్రవేశించెను. కైబర్ కనమయందు ఆలిమసీద్ అనెడి కోటలోనుండి ఆఫ్గనులుఁ బ్రిటిషు సైన్యమును కాల్చిరి. ఆకోట, కొండమీఁదుగా నుండినందువలన వారిని యెదిరించుట మిగుల ప్రయాసగా నుండినను ఆంగ్లేయులు మహాసాహసమును యుక్తియు గలవారు గనుక ఎంతమాత్రమును వెనుదీయక ఫిరంగులను కాల్చి కోటను ఛిన్నభిన్నము చేసిరి. పిమ్మట ఆఫ్గనులు ఆకోటను వదలి పెట్టి పఱుగిడి పోయిరి. అనంతరము బ్రిటిషువారి మొదటి

సైన్యము జలాలాబాదునకు పోయి చేరెను. జనరల్ రాబర్ట్సుగారి చేతిక్రింది రెండవసైన్యము ఖురాం అనుపల్లపు ప్రదేశముగుండా బెయ్వార్ గోడాల్ అను కొండకు పోయి చేరినది. ఆకొండమీఁదుగా ఆఫ్గన్ సైన్యముండెను. అచ్చట జరిగిన యుద్ధమునందును ఆఫ్గనులే పరాజితులై కాబూలునకు పఱుగిడిపోవుచుండిరి. జనరల్ స్టీవార్డల్ చేత నడుపఁబడు చుండిన మూఁడవ సైన్యము బోలన్ కనమగుండా కాండహార్ పోయి చేరినది. ఇట్లు ఆంగ్లేయులయొక్క మూఁడు పటాలములును వచ్చుటను దెలిసికొని అమీరు కాబూలునుండి పఱుగిడిపోయి రష్యావారిని శరణుచొచ్చెను. అతఁడు తనకు సంభవించిన అపజయమునకు మిగుల చింతించి కృశించి యామనోవేదనచేతనే గతించెను. అనంతరము అమీరు కుమారుఁడు యాకూబ్ ఖాన్ అను నతఁడు ఆంగ్లేయులకు మిత్రుఁడైయుండి సమాధానమును గోరినందున, ఆంగ్లేయులు యుద్ధమును నిల్పిరి. పిమ్మట ఆంగ్లేయులలో గొప్ప యుద్యోగస్థులుకొందఱు కొంతసైన్యమును దీసికొని కాబూలునకు పోయిరి. ఆ యాకూబ్ ఖాన్ అను అమీరు ఆంగ్లేయులను మిగుల గౌరవముతో సత్కరించి పంపెను. అయినను, మఱికొన్నిదినముల కంతయు ఆఫ్ఘనులలోఁ కొందఱు దుర్మార్గులు ఆంగ్లేయులతో ఎదిర్చి కలహములు చేయుచుండిరి. ఈవిషయమునుగూర్చి అమీరు ఎంతమాత్రే

మును గమనింపలేదు. ఈవృత్తాంతము ఇండియాకు తెలిసిన వెంటనే, జనరల్ రాబర్ట్సుగారు మరల దండెత్తిపోయిరి. ఆంగ్లేయసైన్యము వచ్చుటను అమీరు విని భయమొంది మరల సమాధానము చేసికొనుటకుఁ గోరినప్పటికిని జనరల్ రాబర్ట్సు వినక కాబూలుకు పోవుచుండెను. పోవునప్పుడు మార్గములోని ఆఫ్గనుల నందఱను జయించుచు కాబూలు చేరి దానిని స్వాధీనము చేసికొనెను. ఇరుతెగలవారును యుద్ధము చేసిరి. ఆఫ్గనులు కాబూలునువిడిచిపెట్టి పఱుగిడిపోయిరి. ఆంగ్లేయులు జయమొందిరి. ఈలోపల జనరల్ స్టూవర్టుగారును సైన్యమును దీసికొని వచ్చిచేరిరి. ఇతఁడు వచ్చునపుడు ఖాజీలు ఎదిర్చిరి. వారిని జయించి గజినీనగరమును స్వాధీనము చేసికొని కాబూలుపోయి చేరిరి. అది మొదలు కొన్నిదినములు కాబూలులో యుద్ధము జరుగలేదు. ఆసమయమునందు ఆఫ్గనిస్థానముయొక్క ఉత్తరభాగములోని జనులందఱును అబ్దుల్‌రహిమాన్ అనునతఁడే అమీరని అంగీకరించినందున బ్రిటిషువారును ఆతనినే ఆఫ్గనిస్థానమునకంతయు అమీరుగా నియమించి వెనుకకు మఱలిరి. అయినను యుద్ధము నిలువలేదు. అయూబ్‌ఖాన్ అనువాఁడు సైన్యమునుగూర్చుకొని కాండహారునకు వచ్చుచుండెను. దారియందు మెయ్‌వాండ్ అనెడి గ్రామమునొద్ద ఘోరయుద్ధము జరిగెను. పిమ్మట జనరల్

రాబర్ట్సు గొప్పసైన్యమును దీసికొనిపోయి ఆఫ్గనుల నంద అను జయించి కాండహారును స్వాధీనము చేసికొనెను. అనంతరము ఆఫ్గనులు, ఆంగ్లేయులతో నెదిర్చి జయమొంద లేమని తెలిసికొని యూరకుండిరి.

జూలు యుద్ధము

1878 వ సంవత్సరము కడపట ఆఫ్గనులతోడి యుద్ధము ముగిసెను. పిమ్మట నెటాలునకు ఉత్తరభాగమున వసియించు జూలుజాతివారు కలహమున కారంభించిరి. ఈ జాతివారు అపుడపుడు ఆంగ్లేయులతో కలహించు చుండిరి. అందువలన, 1879 వ సం॥ జనవరినెల లార్డుచెమ్సుఫోర్డు అనువారు సైన్యమును దీసికొని టుగేలా నదిని దాటిపోయి జూలుజాతివారితో యుద్ధము చేసిరి. అయినను ఆ జనులు ఎక్కువమందిచేరి జగడము చేయుచుండిరి. ఈ వృత్తాంతము లండను నగరమునకు దెలుపఁబడెను. ఆమీఁద లండనునుండి గొప్ప సైన్యము సహాయముగా పంపఁబడినది. ఇరుతెగలవారికిని ఘోరయుద్ధము జరిగెను. జూలుజాతివారు పరాజితులైరి. జూలురాజు పట్టుబడి లండను నగరమునకు గొనిపోవఁబడినాఁడు. పిమ్మట కొన్నాళ్లకు ఆరాజును పంపివేసిరి. అయినను అచ్చటికి పోయినమీఁద పరస్పరము స్వజాతికలహముచేత ఆరాజు మృతినొందెను.

బోయరు యుద్ధము

జూలు యుద్ధానంతరము దక్షిణ ఆఫ్రికాలో ట్రాన్సువాలునందు వసించు బోయర్లు కలహమునకు కాలు ద్రవ్విరి. 1880 వ సంవత్సరము డిసంబరు నెల 20 వ తేది, బోయర్లు ఉన్నట్లుండి ఆంగ్లేయులపై దండెత్తి హింసింపఁ దొడంగిరి. ఈదుష్టులను శాసించుటకై ఆంగ్లేయులు మొదట కొంత సైన్యమును బంపి యుద్ధము చేసిరి. అయినను ఆదేశస్థులందఱు నేకీభవించి ఆంగ్లేయులతో యుద్ధము చేయుటకుఁ దొడంగినందువలన ఆంగ్లేయదొరతనమువారు సమర్థుఁడగు జనరల్ కాలి అనునతనిని సైన్యముతోఁ గూడిపోయి జయింపవలసినదని ఉత్తరవు చేసిరి. ఆప్రకారము బ్రిటిషుసైన్యము ఆదేశమునకుఁ బోయి యుద్ధము చేయుటకు ప్రారంభింపఁగానే, బోయర్లు ఆంగ్లేయులతో ఒడంబడిక చేసికొని సమాధానపడిరి. పిమ్మట ఆంగ్లేయులు యుద్ధమును చాలించిరి.

ఈజిప్టు యుద్ధము

ఈజిప్టును పాలించుచుండిన ఇస్మాల్ పాషా అను నతఁడు వ్యర్థముగా ఖర్చుచేయుచుండినందున ఆదేశము ఋణమున మునిఁగిపోయినది. ఆమీఁద ఆంగ్లేయ దొరతనమువారును ఫ్రెంచి దొరతనమువారును ఆతనిని బలవంతపెట్టి తొలఁగించి, రాజ్యమును అతని కొమారుఁడు ట్యూఫిక్ అను నతని స్వాధీనము చేసిరి. ఈపద్ధతి యుక్తము కాదని ఈజిప్టు దేశీయులు

కొందఱు కలహముచేయఁ దొడంగిరి. ఈకలహకారులకు కర్నల్ అరబి అనువాఁడు సేనాధిపతి యాయెను. వీఁడు మూర్ఖుఁడుగ నుండినందువలన టుఫ్యూఫిక్ యొక్క రాజపద వికి భంగము వచ్చునట్లుండినది. పిమ్మట ఆంగ్లేయులును ఫ్రెంచివారును తమతమ ఓడసైన్యములను బంపి అలెగ్జాండ్రియాలో సిద్ధముగానుండునట్లును ఈజిప్టులోని ఆంగ్లేయులకును అచ్చటిరాజునకును అపాయము రానీక చూచుకొనుచుండు నట్లును నియమించిరి.

1882 వ సంవత్సరము జూన్ నెల 11వ తేది కలహము అధిక మైనది. చాలమంది ఆంగ్లేయులు హింసింపఁబడిరి. వెంటనే బ్రిటానియావారు యుద్ధమున కారంభించిరి. ఈజిప్టు దేశము లోని జనులును అచ్చటి సైనికులును కలహకారులతోఁ జేరిరి. ఈసమయమున ఫ్రెంచివారు యుద్ధము చేయుటకు ముందడుగుపెట్టలేదు. ఆంగ్లేయులు మాత్రము యుద్ధము చేయఁ దొడంగిరి. జూలై నెల 5 తేది అలెగ్జాండ్రియా కోటను ముట్టడించి నాలుగుగంటలసేపు ఘోరయుద్ధముచేసి ఫిరంగు లను కాల్చి ఆకోటను ఆంగ్లేయులు స్వాధీనము చేసికొనిరి. పిమ్మట ఇంగ్లండునుండియు ఇండియానుండియు పటాల ములు పోయి చేరినవి. సర్ గార్నెట్ ఉల్‌స్లి అనువారు సేనాధిపతిగా వచ్చిరి. ఇస్మాలియా అను గ్రామమును యుద్ధ ము చేయకయే స్వాధీనము జేసికొనిరి. కస్సాసిన్ అనుచోట

ఘోరయుద్ధము జరిగెను. కలహకారులు చెల్లాచెదరై పాఱిపోయిరి. టెల్-ఎల్-కెబీర్ అనుచోట జరిగిన యుద్ధమునందును శత్రువులు పలాయితులైరి. పిమ్మట ఈజిప్తువారు ఆంగ్లేయులను శరణుఁజొచ్చి సమాధానము చేసికొనిరి. పిదప కలహకారులకు నాయకుఁడైన అరబి అను వానిని పట్టి చెఱయం దుంచిరి. అంతటితో యుద్ధము ముగిసెను.

సౌడాన్ యుద్ధము

టెల్-ఎల్-కెబీర్ యుద్ధమైనది మొదలు ఈజిప్తు దేశము ఆంగ్లేయుల స్వాధీనమయ్యెను. అదిమొదలా దేశమునందుఁగల సకలమైనవారును క్షేమముగా నుండిరి. అయినను నైల్ నదీతీరమునందలి సౌడాన్ అను ప్రదేశముమాత్రము ఈజిప్తురాజు వశమున నుండెను. ఉద్యోగస్థులే దానిని పాలించుచుండిరి. అచ్చట నొకఁడు తాను మహమ్మదీయ దీర్ఘదర్శి కాఁబోవునట్లును, తన పేరు మాహిది అనియును చెప్పికొనుచు, అడవిమనుష్యులను కొందఱను తనకు సహాయులనుగాఁ జేర్చికొని పటాటోపము చేయుచుండినాఁడు.

ఇట్లుగా నీమాహిది దుష్టులను వశపఱచికొని ఎల్ ఒబీడ్ అను నగరమును ముట్టడించినాఁడు. అందువలన హిక్సు పాషా అనెడి ఆంగ్లేయ సేనాధిపతి ఈజిప్తు సైన్యమును దీసికొనిపోయెను. ఇట్లీతఁడు పోవుచుండఁగా దారి

లోనే ఆ మాహిదియొక్క సైన్యమువచ్చి సేనాధిపతిని అతని సైన్యములోఁగూడా హతము చేసెను.

అనంతరము ఇంగ్లండునుండి జనరల్ గార్డన్ అను వారు ఈజిప్టు దేశమునకు గవర్నరుగను, ఈజిప్టు సైన్యమునకు సేనాధిపతిగను నియమింపఁబడి వచ్చుచుండిరి. ఈలోపల మాహిది సైన్యము సువాకిం అను రేవుపట్టణమును, సిన్కాట్, టోకార్ అను పట్టణములను స్వాధీనము చేసికొనుటకై ప్రయత్నించు చుండెను. కాబట్టి ఈదుష్టులను దండించుటకై బేకర్ పాషా అనునతఁడు ఈజిప్టు సైన్యముతో సముద్ర మార్గముగుండా ట్రిన్కిటాట్ అను రేవు పట్టణమును జేరెను. పిమ్మట, అతఁడు టోకార్ అను పట్టణమునకుఁ బోవుచుండఁగా దారియందే మాహిదియొక్క పరిజనులు సైన్యమును ఛిన్నభిన్నము కావించిరి. మఱియు సిన్కాట్టు నందున్న ఆంగ్లేయసైన్యమునుకూడా ఆ దుర్మార్గులు చెల్లా చెదరు చేసిరి.

జనరల్ గ్రాహాం అనువారు గొప్ప దండును దీసికొని బయలుదేరి పోయి ట్రిన్కిటాట్ రేవును జేరిరి. ఆపిమ్మట ఇరుతెగలవారికిని ఘోరమైన యుద్ధము జరిగెను. ఇంతలో పల జనరల్ బుల్లర్ అనువారును సహాయార్థమై వచ్చి చేరిరి. అనంతరము ఆ మాహిది మనుష్యులలో గతించిన వారుపోఁగా మిగిలినవారు పలాయితులైరి. ఈ సౌడాన్

యుద్ధము 1884 వ సం. మార్చి నెలతో ఏదో ఒక విధముగా సమాప్త మాయెను.

కార్టూం యుద్ధము

జనరల్ గార్డన్ అనువారు 1884 వ సంవత్సరము ఫిబ్రవరి నెలలో కార్టూం అను పట్టణమునకు వచ్చిచేరిరి. ఇది సౌడాన్ నగరమునకు రాజధాని. ఇచ్చటను మాహిది యొక్క సైన్యము ప్రవేశించి యుండెను. ఇంగ్లండునుండి లార్డు ఉల్‌స్లి ప్రభువు గొప్ప దండుతో బయలుదేరి వచ్చిరి. వారు శీఘ్రముగా కార్టూం పోవుటకై నెల్‌నదీతీరమున కోర్టి అను చోట దిగి మెట్టమార్గముగా ఎడారిని దాటి పో వచ్చునని నిశ్చయించి పోవుచుండిరి. వీరు పోయిచేరుటకు ముందుగానే కర్నల్ బర్నాబి, జనరల్ స్టూవర్టు మొదలగు వారు ఆబూక్లి అను చోటను, మెటెమ్మె అనుచోటికి పోవుదారియందును జరిగిన యుద్ధములలో హతులైరి. మిగిలి యున్న సైన్యమును దీసికొని సర్ చార్లెస్ విల్సన్ అను వారు కార్టూమునకు పోవుచుండిరి. ఈలోపలనే శత్రువులు జనరల్ గార్డన్ అనువారిని చంపి ఆనగరమును స్వాధీనము చేసికొనిరి. అందువలన చార్లెస్ విల్సన్ గారిని, ఇంకను ఆప్రాంత్యమునందు అచ్చటచ్చటనున్న సైన్యమును వెనుకకు పిలిచికొనిరి.

సువాకిం యుద్ధము

జనరల్ గ్రాహాం అనువారితో రెండు తేపలు జగడము చేసి అపజయమునొందినట్టి మాహిదియొక్క మిత్రుఁడైన ఓస్మాన్ డిగ్నా అనువాఁడు మఱల మనుష్యులను చేర్చుకొని యుద్ధమునకు వచ్చెను. కాఁబట్టి వానిని దండించుటకై ఇండియాయం దుండియు ఆస్ట్రేలియాయం దుండియు సైన్యము పోయి చేరినవి. ఈసైనికులు అరేబియావారి గర్వమును అణఁగద్రొక్కిరి. అరేబియావారు కొండలలోనికిఁ బోయి దాఁగి కొనిరి. ఆంగ్లేయులు తమ సైన్యములో కొంత సువాకిం అను తక్కిన సైన్యమును వెనుకకుఁ బిలిచికొనిరి. ఇపుడు ఈశిస్ప్రదేశము ఆంగ్లేయులవశమున నున్నది.

ఐర్లండ్ వృత్తాంతములు

ఆంగ్లేయ ధొరతనమునకు మిస్టర్ గ్లాడ్స్టన్ అనువారు ప్రధానమంత్రి యైనమీఁద, వారు కొన్ని నూతన పద్ధతులను అమలులోనికిఁ దెచ్చిరి. ఆపద్ధతులు ఐర్లాండువారికి సమ్మతము కాకపోయెను. అందువలన మిస్టర్ పార్నెల్ అనునతఁడును ఐరిష్ప్రముఖులును జేరి గొప్ప కలహము చేయఁదొడంగిరి. అంతియగాక, డబ్లిన్ నగరమునందు ఐరిష్ సెక్రిటరిగా నియమితులైయున్న లార్డు ఫ్రెడరిక్ కావెండిష్ ప్రభువును, ఐరిష్ ఉద్యోగస్థుఁడైన మిస్టర్

బర్కు అనునతనిని శత్రువులు నఱికి పాఱవైచిరి. ఇందు వలన ఐరిష్‌వారిలో ననేకులనుబట్టి చెఱయం దుంపవలసి వచ్చినది. ఇంతియగాక వారినిమిత్తమై నూతన నిబంధనములును కావింపఁబడియెను.

1883 వ సంవత్సరమునందు అమెరికాలోనుండు ఐరిష్ జాతివారు లండన్ నగరములోని రాజకీయ సంబంధమైన భవనముల నంతయు నేలమట్టము గావింప సంకల్పించి యుండిరి. ఈవృత్తాంతమును ఆంగ్లేయులు దెలిసికొని జాగ్రత్త వహించిరి. పోలీసువారు ఐరిష్‌వారి దుర్మార్గ కృత్యములను అప్పటి కప్పటికి దెలిసికొనుచుండిరి. ఇందువలన ఐరిష్‌వారి యత్నము నెఱవేఱక పోయినది.

వస్తుప్రదర్శనశాల

1886 వ సంవత్సరారంభమునందు విక్టోర్యా చక్రవర్తినిగారు పార్లిమెంటుసభను ప్రారంభించిరి. ఆమె పార్లిమెంటుభవనమునకుఁ బోవునపుడు మార్గమందు ప్రజలు గుమిగూడి దీవించిరి. రాణిగారు రాజకీయ సంబంధమైన సకల పరివారముతోఁగూడి కిరీటధారిణియై పోవుట చాల అరుదుకావున ఆమెను జూచుటకై వేనవేలుజనులు ఆతురపడుచుండిరి. రాణిగారు ఇట్టి యాడంబరముతోనే మార్చినెల వైద్యకళాశాలయందు ఒకనూతన మంటపమునకు పునాదివేయుటకు

పోయియుండిరి. అనంతరము ఆయువారములకుమీఁద సౌత్ కెన్సింగ్టన్‌లో కలోనియల్ అండ్ ఇండియన్ వస్తుప్రదర్శన శాలను విక్టోర్యామహారాజ్ఞిగారు తెఱచిరి. ఆప్రదర్శనశాలకు ఆంగ్లేయ దొరతనమునకు లోఁబడిన దేశములలోనుండి వివిధములైన చేతిపనులును ధాన్యములును వచ్చియుండినవి; ఆయా దేశప్రతినిధులును వచ్చియుండిరి. ఆశాలను చాల శ్రమవహించి వేల్సుయువరాజుగారు నిర్మించిరి.

పార్లిమెంటు విషయములు

ఐర్లాండు ప్రజలు ఆంగ్లేయులకు విరోధముగా ప్రవర్తించుచుండిరని మున్నే చెప్పియున్నాముకదా! అమెరికాలోని ఐరిష్ జనులు సెంట్ జేమ్సు స్క్వేయర్, స్కాట్లండు యార్డ్ అను చోటులలో మందుపెట్టి కాల్చుచుండిరి. లండన్ వంతెనయొక్క ఆసరా సంబంధమైన కట్టడమును మందు పెట్టికాల్చి పగులఁగొట్టుటకై ప్రయత్నము చేసిరి. టవర్ అనుకట్టడములోని ధనశాలకును పార్లిమెంటు భవనమునకును మందుపెట్టిరి. ఇట్టి దుష్కార్యములను చేయుచున్నందువలన ఆంగ్లేయులలో ననేకులకు ధన నష్టము సంభవించెను. కొందఱకు బలమైన గాయములు కలిగినవి. దొరతనమువారు దుష్టులలోఁ గొందఱను శిక్షించిరిగాని, కలహములు నివృత్తికాలేదు. ఈలోపల కొన్నిమంచికార్యములు చేయుటకే కాఁబోలు గ్లాడ్‌స్టన్ మంత్రిగారు కొన్నిక్రొత్త

పన్నులు విధింపవలయు ననిరి. పార్లిమెంటువారు అంగీకరింప నందున 1885 వ సంవత్సరమున మంత్రిపనికి రాజీనామా యిచ్చిరి. పిమ్మట లార్డు సాలిస్ బరి ప్రధానమంత్రి యయిరి. వారు కన్సర్వేటివ్ కక్షిని జేరినవారైనందున. ఆసంవత్స రాంత్యమున పార్లిమెంటులో క్రొత్తగా సభ్యుల నియమించి నపుడు కన్సర్వేటివ్ కక్షివారికంటె లిబరల్ కక్షివారి సంఖ్య హెచ్చైనందున లార్డ్ సాలిస్ బరి తమపనికి రాజీనామా యిచ్చిరి. పిమ్మట మిస్టర్ గ్లాడ్ స్టన్‌గారు మంత్రిపట్టమును పొందిరి. ఆయన ఐర్లాండువారికి హోంరూల్ ఇప్పింపవలసి నదనిచెప్పిరి గాని పార్లిమెంటువారు అంగీకరింపరైరి.

1886 వ సంవత్సరము పార్లిమెంటులో కన్సర్వేటివ్ కక్షివారు జయమొందినందున గ్లాడ్ స్టన్‌గారు తమపనికిరాజీ నామా యిచ్చిరి. మరల సాలిస్ బరిప్రభువు మంత్రియైరి.

లివర్పూల్ వినోదవస్తుశాల

విక్టోర్యా చక్రవర్తినిగారు 1886 వ సం. మేనెల 11 తేది లివర్పూలునందు ఇన్టర్ నేషనల్ వస్తుప్రదర్శన శాలను తెఱచిరి. ఆమెయొక్క గౌరవార్థమై నగరమంతయు అలంకరింపఁబడెను. ఎచ్చటఁ జూచినను జనసమూహాముతో నిండి యుండెను. ఆమె పోయినట్టి మార్గమునందు జనులు చేరి ఆమెకు స్వాగత మొసంగి సత్కరించిరి. జూన్ నెల కడ

పట మిస్టర్ హాలోవే అనువారు స్త్రీలకై యేర్పఱిచిన కళాశాలను తెఱచిరి. లండన్ నగరములోని తూర్పుభాగమున కూలినాలిచేసి పొట్టపోసికొను జనులు సంతోషముగా విహరించి కాలము గడపుటకును చదువు నేర్చుకొనుటకును కట్టఁబడిన జనులగృహము అనుదానిని 1887 వ సంవత్సరము మే నెలలో తెఱచిరి. ఇది ఆమె కావించిన ముఖ్యమైన కార్యములలో నొకటి యగును. దీనిని నిర్మించినందులకు జనులు మిగుల హర్షించిరి.

రాజ్యపాలన పంచాశద్వత్సరము

'జూబిలి మహోత్సవము'

1887 వ సంవత్సరము జూన్ నెల 21 తేది మహారాజ్ఞిగారి జూబిలి మహోత్సవము జరిగెను. ఆంగ్లేయ రాజాంగమునకు లోఁబడియున్న ప్రజలందఱును ఆమహోత్సవమును చాలసంతోషముతో నంగీకరించిరి. మఱియు, అచ్చటచ్చటఁగల ప్రజలు ఆమహోత్సవమును చేసినదేగాక, ఆజూబిలియొక్క జ్ఞాపకార్థమై ఎన్నెన్నో సత్కార్యములును చేసిరి. గ్రేట్‌బ్రిటనులోను ఈయుత్సవము చక్కఁగా జరిగెను. ప్రతిపట్టణమును దీపావళులతోను తోరణాదులతోను అలంకృతమై శోభిల్లుచుండెను. ఇంగ్లండు, స్కాట్లండు, ఐర్లాండు అను నీమూఁడు ప్రదేశములలోఁగల ఇనూర్వరు పర్వతశిఖరములమీఁద అఖండదీపములు వెలుఁగుచుండినవి.

లండన్ నగరమంతయు అలంకరింపఁబడి కనులపండువై యొప్పుచుండెను. ఐరోపా దేశములోని ప్రతిరాజకుటుంబములోనుండియు నొక్కొకరు విచ్చేసియుండిరి. డెన్మార్కు, సాక్సని, గ్రీస్ అను నీమూఁడు దేశములలోనుండియు రాజులు వచ్చియుండిరి. ఇండియాలోనుండియు రాజులును ప్రభువులును ధనికులును పోయియుండిరి. ఇండియానుండి పోయినవారందఱును విలువగల వస్త్రాభరణాలంకృతులై తేజరిల్లుచుండిరి. అందఱికంటెను హోల్కారుగారు అమూల్యమైన రత్నాభరణములను ధరించియుండిరి. ఆదినము వివిధములగు వినోదములు సలుపఁబడెను. దేశమందలి పాఠశాలలోనెల్ల బాలురకు విందుచేసిరి. ఆజూబిలియొక్క మహోత్సవమును వర్ణింపఁ దరంబుగాదు. ఆదినము మహారాజ్ఞిగారు తమ ప్రజలయెడఁగల వాత్సల్యముచేత నొక' విన్నపపత్రికను వ్రాసినారు. దాని సారాంశ మేమనఁగా:—

„ నాపుత్త్రిలతోను పుత్త్రికలతోను మనుమలతోను మనుమరాండ్రతోను వెస్టు మినిస్టర్ ఆబ్బి యనెడి ఆలయమునకు నేను పోవునపుడును వచ్చునపుడును ప్రజలు నన్ను మిగులగౌరవించిరి. లండన్ నగరములోనివారును విండ్సర్ లోనున్నవారును సత్కారము లొనర్చిరి. ఇట్లు నన్ను గౌరవించిన ప్రజలయొక్క విశేష వాత్సల్యమును జూచి చాల సంతోషము నొందుచున్నాను.

"నేను రాజ్యము నేలుటకు ప్రారంభించినది మొదలు ఈ యేఁబది సంవత్సరములలోపల ఇంచుమించుగా ఇరువది రెండేండ్లు సకల సంపదలను కొఱఁతలేక నాప్రియునితోఁ గూడి కాపురము చేయుచున్నకాలమునను, అతనియొక్క అనంతరము మిగుల చింతతోఁగూడిన కాలమునను, రాజ్య వ్యవహార సంబంధమైన పలువిధములగు కష్టముల ననుభవించుచున్నకాలమునను, నేను జనుల మేలునకై పాటుపడు చుండినదానిని నాప్రజ లెఱింగి గౌరవము నొసంగిరి. ఇట్లు ప్రజలు నాయందు ఆదరముగలవారై నాకొసంగిన గౌరవము నకు నేను కృతజ్ఞతగలదాననై యున్నాను. మఱియు నా ఆయుష్కాలముదాఁక నాయొక్క ప్రజలమేలునకే పాటుపడు చుండఁగలను. ఎప్పుడుగాని నాప్రజలయెడల నాకు ఆదరము కలదు. ఇంకను జనోపయోగకరమైన కార్యములు పెక్కులు చేయవలసియున్నవి; వానినంతేయు నాప్రజలు నెఱవేఱు నట్లు. సహాయము చేయుదురని నమ్మెదను.

"'జూబిలి' దినమునందు సామాన్యజనులు కావించు అల్లరులను అపుటకై అధికారులుచేసిన యేర్పాటులకును, వేలకొలఁది జనులు క్రిక్కిరిసియుండియు వారు నడుచుకొన్న మంచిపద్ధతిని గూర్చియును, చాల సంతోషించుచున్నాను."

"సకలశక్తులుగల సర్వేశ్వరుఁడు దేశమును రక్షించి ఆశీర్వదింపవలయు ననునదియే నాయొక్క ముఖ్యమైన ప్రార్థనము."

పైని జెప్పిన జూబిలిమహోత్సము అనునది మహారాజ్ఞి గారు పట్టాభిషేకమైనది మొదలు ఏఁబదియేండ్లు రాజ్యపాలన మొనర్చినందులకై కావింపబడిన మహోత్సవము. ఈమహోత్సవమును ఆ 1887 వ సంవత్సరము జూన్ నెల 21 తేది యందే అపుడు రాజప్రతినిధిగానున్న డఫ్రిన్ ప్రభువుగారు ఇండియా దేశమునందును జరపించిరి. హిందూదేశమం దెల్లచోటుల లోను ఆమహోత్సవము కొనియాడఁ బడినది. హిందూదేశీయు లనేకులు రాణిగారిపేర జనోపయోగకరములగు కార్యముల ననేకములను జేసి రాజభక్తిని వెలిబుచ్చిరి.

లేడి డఫ్రిన్ నిధి

డఫ్రిన్ ప్రభువుగారు ఇండియాకు వైస్రాయిగా నియమింపఁబడి పంపఁబడిన కాలమునందు, విక్టోర్యా మహారాజ్ఞి గారు ఆయనభార్యయైన లేడి డఫ్రిన్‌గారిని రావించి, ఆమెతో నీవు హిందూదేశములోని స్త్రీలకై నీచేతనైనంత మేలును చేయవలసినదని చెప్పిరి. డఫ్రిన్ ప్రభ్వియు రాణిగారి ఆనతిని శిరసావహించి, ఆమె యిండియాకు వచ్చినమీఁద 'డఫ్రిన్ ప్రభ్వీనిధి' అనెడి నిధిని స్థాపించెను. ఆనిధియొక్క సాహాయ్యమున ననేక స్త్రీవైద్యశాల లేర్పడినవి. కొంతకాలమునకు ముందు పునాలోనున్న ఒక స్వదేశరాణియొక్క దీర్ఘరోగమును ఒక ఆంగ్లేయ వైద్యురాలు కుదిర్చెను. పిమ్మట ఆవైద్యురాలు ఇంగ్లండునకు పోయినప్పుడు అపునారాణి విక్టోర్యా

మహారాజ్ఞిని సందర్శించి హిందూదేశములో స్త్రీలు పడెడి కష్ట ములను నివేదింపు మని కోరెను. ఆవైశ్యరాలు ఆలాగే పునా రాణిచెప్పిన సందేశమును విక్టోర్యామహారాజ్ఞితో విన్న వించెను. అంతట విక్టోర్యా రాణిగారు పునారాణికి "హిందూ దేశస్త్రీలయొక్క సంతాపకరమైన స్థితిని తొలఁగించుటకు ప్రయత్నము చేయఁబడును" అని లేఖనొకటి పంపిరి. ఈయభి ప్రాయమును మనస్సున నుంచికొనియే మన మహారాజ్ఞి గారు డఫ్రిన్ ప్రభ్విగారికి తెలియఁబఱిచిరి. ఇపుడు ఈనిధి వలన హిందూస్త్రీలకు చాల మేలు కల్గెను.

ఏఁబదియేండ్ల యభివృద్ధి

విక్టోర్యా మహారాజ్ఞిగారియొక్క ఏఁబదియేండ్ల పరి పాలనలో ననేకవిధములగు మార్పులు కల్గినవి. అవి యన్నియు ప్రజాక్షేమము ననుసరించినవై యున్నవి. రెయిలు, పొగయోడలు, తంతి, టపాలా మొదలగు సౌకర్యములు కల్గినవి. లోకవృత్తాంతములను దెలిసికొనుటకుఁ దగిన వార్తాపత్రికలు ప్రకటితము లైనవి. మఱియు విద్యాభివృద్ధి, కలాకౌశలము (పాటకపు పనులు) వృద్ధి యయ్యెను. ఈమె ఏలుబడియందేకదా టెనిసన్, బ్రౌనింగ్, స్విన్‌బర్న్, థాక్కరే, డిక్కెన్స్, రస్కిన్, కార్లైల్ మొదలగు ఆంగ్లేయ మహాకవులు ప్రఖ్యాతి నొందిరి. వీరిలో టెనిసన్ విక్టోర్యా

మహారాజ్ఞిగారి మిత్రకోటిలోనివాఁడును ఆస్థానకవియునై యుండెను.

ఈమె కాలముననే బ్రిటిషుదేశము ప్రబలమైన రాజ్యమైనది. సకలదేశములలోను ఆంగ్లేయుల పాలనకు లోఁబడిన దేశమే శ్రేష్ఠమైనదని సకలదేశస్థులును అంగీకరించుచున్నారు. విక్టోర్యా రాజ్యకాలమున జనసంఖ్య పూర్వముకంటె రెండింతలైనది. ఆస్ట్రేలియా, న్యూజిలండు అను నీరెండు ప్రదేశములయందు పూర్వము ఆదేశపు ఆదిమ నివాసులగు అడవిమనుష్యులు అచ్చటచ్చట కొందఱు నివసించి యుండిరి. ఇప్పు డాదేశములయం దాంగ్లేయులుచేరి పల్లెలనంతయు పట్టణములుగా చేసివేసిరి. కనడా దేశమునందు జనసంఖ్య వృద్ధియైనది. ఆంగ్లేయులుపోయి నివసించెడి ప్రదేశములందు ఇంకను కోట్లకొలఁదిజనులు నివసించుటకు వసతులున్నవి.

అచ్చటచ్చట వస్తుప్రదర్శనశాలలు అప్పుడపుడు నిర్మింపఁబడి ప్రదర్శించినందువలన పాటకపుపనులుచేయువా రనేకులు క్షేమము నొందిరి. మద్యనిరసన సంఘములవలనను కోఆపరేటివ్ సంఘములవలనను, కూలివారిసంఘములవలనను, వృత్తిసంఘములవలనను అనేకులు మేలునొందిరి. టపాలాకూలి తక్కువయైనందునను, ప్రయాణికుల రాకపోకలసాధనముల కూలి తగ్గింపఁబడినందువలనను సకలమైనవారును

సౌఖ్యపడిరి. మఱియు సేవింగ్సు బాంకి ఏర్పాటుచేయఁబడ నందున బీదలు మొదలగువారు కష్టకాలమునందు తమ్ము రక్షించుకొనఁ గలిగిరి. ఆంగ్లేయులుపోయి చేరినప్రదేశముల యందనేకులకు ఉద్యోగములు లభించెను. కొందఱకు ఇతర పనులును ఏర్పడియున్నవి. ఈ నేఁబదియేండ్లలోఁగా ఇంతటి అభివృద్ధి నొందినది చాలా ఆశ్చర్యమేకదా?. ఇంకొక ఏఁబదియేండ్లకు పిమ్మట ఇంతకంటె రెండింతల మేలు కల్గుననుటకు సందేహమేమున్నది? సాధారణముగా రాజులు జనక్షేమకార్యములను చేయుటకు ప్రయత్నించినపుడు ప్రజలును సహాయపడవలయును. ధనికులు అనేకులు విశేష ధనమును వ్యయముచేసి అనేకధర్మకార్యములు చేసిరి. అందువలననే ఇంత శీఘ్రకాలమున దేశము అభివృద్ధి నొందినది.

రాణిగారి మనోవ్యాకులత

ఎట్టివారికైనను ఇక్కట్టులు రాకమానవుకదా? 1888 వ సంవత్సరమున రాణిగారు ఇంగ్లండును విడిచి బయలు వెడలి పలుదేశములకేఁగి ఏప్రెల్ నెల 27 తేది మరలివచ్చి చేరిరి. జూన్ నెల 15 తేది పెద్దల్లుఁడు ఫ్రెడరిక్ చక్రవర్తి గతించినందువలన వ్యసనసాగరమగ్నులైరి. ఆసంవత్సరమునసే ఆమె స్నేహితురాలైన స్కాట్లండు దేశపురాణిగారు గతించినందున మిగుల దుఃఖమయ్యెను. 1892 వ సంవత్సరము జనవరినెల 14 తేది ఆమె మనుమఁడు క్లారెన్సుప్రభువు

పరలోకవాసులైనందున ఈదుఃఖము ఆమెకును ఆమెకుటుంబ
మువారికిని మాత్రమేగాక లోకములోనివారి కెల్లరకును దుఃఖ
ముగా నుండినది. ప్రజలు మిగుల చింతించి తమ యనుతాప
ములను దెలియఁజేసిరి. అందుల కామె, అందఱియొక్క
అనుతాపములు తమకు ఊరటగల్గించెనని తెలియఁజేసిరి.

1895 వ సంవత్సరాంత్యమున ట్రాన్సువాల్ జనులు
చెలరేఁగినందున, ఆంగ్లేయులు యుద్ధముచేయవలసి వచ్చినది.
ఈయుద్ధమునకు సైన్యాధిపతిగా నియమించి పంపఁబడిన
రాణిగారి అల్లుఁడు హెన్రిప్రభువు మార్గమందే 1896 సం.
జనవరి నెల 20 తేదీ మృతినొందిరి. వీరి మరణమువలనను
రాణిగారికి చాలదుఃఖము సంభవించెను. ఇట్లు రాణిగారు
దుఃఖసాగరమున మునిఁగియున్నను, ప్రజల క్షేమమునకు
భంగముకల్గినపుడు ఊరకయుండినది లేదు.

మహారాజ్ఞిగారి దయ

విక్టోర్యా రాజ్ఞిగారు స్వభావముననే చాల దయగల
వారు. అందులోను తమప్రజలు ఆపదలకు లోనైరని తెలి
సినయెడల చాల పరితపించుచుందురు. ఎచ్చట బొగ్గుగనులు
మొదలగునవి కూలి జననష్టము సంభవించినను, ఓడలు
మొదలగునవి మునిఁగి జనులు మరణించినను, అగ్నిబాధచే
ప్రజలు నశించినను, యుద్ధములయందు జనులు నొచ్చినను,

రాణిగారు అట్టివారికిని, వారికుటుంబమునకును చాలసహాయము చేయుచుండిరి. ఆమెయొక్క ఔదార్యమును వర్ణించుటకు సాధ్యముకాదు. దక్షిణ ఆఫ్రికాయుద్ధమున గతించిన యోధులవిషయమై ఆమె కనఁబఱచిన ప్రీతివిశ్వాసములను జూచినయెడల తల్లికి బిడ్డలయం దెట్టిప్రేమ యుండునో అంతకంటె నధికముగా నుండెను.

రాజ్యపాలన షష్టిపూర్తి
'డైమండ్ జూబిలి'

1897 వ సంవత్సరము జూన్ నెల 21 తేది విక్టోర్యా మహారాజ్ఞిగారి రాజ్యపాలనముయొక్క అఱువదియవసంవత్సరము పూర్తి యయినది. అందునిమిత్తమై ఈమహోత్సవము చేయఁబడెను. దీనికి 'డైమండ్ జూబిలి' అని పేరిడఁబడెను. ఈయుత్సవము ఆంగ్లేయ రాజ్యమునకు లోఁబడిన సకలప్రదేశములయందును కావింపఁబడినది. ఏఁబదియవ సంవత్సరము పూర్తియైనపుడు కావించిన జూబిలి ఉత్సవమునకంటె నీమహోత్సవము అత్యంత వైభవముగ జరుపఁబడినది.

ఈయుత్సవమునాఁడు విక్టోర్యాచక్రవర్తినిగారు రాజకీయ పరివారముతో ఊరేఁగిరి. దీనికిపిమ్మట ఆమె బయటరాలేదు. ఇండియాలో నీమహోత్సవమును అప్పుడు రాజప్రతినిధియై యున్న ఎల్జిన్ ప్రభువుగారు జరపిరి. హిందూదేశమునఁగల

ప్రతిపట్టణములలోను మహాజనులు సభలుచేసి తమతమ రాజభక్తిని తెలియఁజేసిరి. రాజప్రతినిధిగారు సిమ్లాలో నొక మహాసభను జేర్పించిరి. అందులకు స్వదేశరాజులును ప్రభు



విక్టోర్యా చక్రవర్తిని

వులును గొప్పఉద్యోగస్థులును పోయియుండిరి. ఆసభలో ఎల్జిఁప్రభువుగారు మహారాజ్ఞిగారి పాలనలోని విశేషములనుగూర్చి చక్కఁగా నుపన్యసించిరి. డైమండ్ జూబిలి జరి

గిన మీఁదట విక్టోర్యాచక్రవర్తినిగారు ఒకలేఖను వ్రాసిరి. అందు "నా పరిపాలనయొక్క షష్టిపూర్తికాలంబునందు సకలప్రజలును కనఁబఱిచిన సంభ్రమముతోఁ గూడిన రాజభక్తికై నేనెంతయు సంతోషించుచున్నా ననుదానినిగూర్చి చెప్పుటకు సాధ్యముకాదు" అని వ్రాయఁబడి యుండెను.

అఱువదిసంవత్సరముల ప్రయోజనము

విక్టోర్యాచక్రవర్తినియొక్క ఏలుబడియందు ఎచ్చట దుర్మార్గులు చెలరేఁగి కలహములు చేసినను ఆయల్లరి మూఁకలను పరిమార్చుటకై తగిన ప్రయత్నములు చేయఁబడుచుండెను. కాఁబట్టియే ఆమెయొక్క పాలనమునందు దేశము క్షేమముగా నుండినది.

ఆమె పట్టమునకు వచ్చినట్టి 1837 వ సంవత్సరమునందు బ్రిటిషుద్వీపములలో రెండుకోట్ల అఱువదిలక్షలజను లుండిరి. ఇప్పుడు నాలుగుకోట్లజను లున్నారు.

ఆంగ్లేయులకు మునుపున్న దేశమునకంటె ఇపుడు యూరోపులోని ఆఱింట నొకభాగము అధికముగా నున్నది. ఈ యెక్కువప్రదేశము ఈమెకాలముననే జయింపఁబడినది.

ఇపుడు ఆంగ్లేయరాజ్యము ఒకకోటి పదునాలుగులక్షల చదరపుమైళ్ల విస్తీర్ణమై యున్నది. అనఁగా ప్రపంచమునందలి భూభాగములో నైదవపాలుకంటె అధికముగా నున్నది.

ఈమె పాలనములోని జనసంఖ్య నలుబదికోట్ల యిరువది యైదులక్షల పదునాలుగువేలు. అనఁగా ప్రపంచములోని జనులలో నాలవవంతుకంటె నెక్కువయై యున్నది.

మహారాజ్ఞిగారు పట్టమునకు వచ్చినపుడు హిందూ దేశములో ఇంగ్లీషువారి స్వాధీనమునందున్న భూమియొక్క వైశాల్యము ఐదులక్షల అఱువదివేల చదరపు మైళ్లు.

అప్పుడు హిందూదేశములోని ఆంగ్లేయులపాలనకు లోఁబడియున్న జనసంఖ్య పదికోట్లు. ఇప్పుడు ముప్పదికోట్లు.

రాణిగారు రాజ్యమునకు వచ్చినపుడు బ్రిటిష్ ద్వీపముల వలని ఆదాయము నన్నూటడెబ్బదిలక్షల పౌనులు. ఇపుడు వేయిలక్షలపౌను లైనవి.

అపుడు ఆంగ్లేయవర్తకులు చేయుచున్న వ్యాపారము యొక్క మొత్తము పంద్రెండుకోట్ల పౌనులు; ఇపుడు డెబ్బది కోట్ల పౌను లైనవి.

అపుడు హిందూదేశీయులు ఇతరదేశములవారితోఁ జేసిన వ్యాపారముయొక్క మొత్తము పందొమ్మిదికోట్ల రూపాయలు. ఇపుడు ఇన్నూరుకోట్ల రూపాయ లైనవి.

అపుడు హిందూదేశముయొక్క ఎగుమతి దిగుమతుల యొక్క మొత్తము రెండుకోట్ల పదిలక్షల పౌనులు. ఇపుడు పదునాఱుకోట్ల పౌను లైనవి.

ఆంగ్లేయ సైనికులయొక్క మొత్తము లక్షయువేయి నేనూటయెనుబది. అందు పందొమ్మిదివేలు హిందూదేశము నందును, ఇరువదివేలు ఐర్లండులోను ఉండెను. ఇపుడు సైనికుల మొత్తము ఆరులక్షల యిరువదివేలు. మఱియు యుద్ధ విద్యాభ్యాసము నేర్పింపఁబడి వలయునపుడు యుద్ధమునకు సన్నద్ధు లగుస్వేచ్ఛాసైనికులు తొమ్మిదిలక్షలు కలరు.

రాణిగారు పట్టమునకువచ్చిన సంవత్సరమునందే అగ్గిపుల్లలు మొట్టమొదట చేయఁబడినవి. రాణిగారు పట్టమునకు వచ్చుటకు కొన్నాళ్లకు ముందే విద్యుచ్ఛక్తి కనిపెట్టఁబడినను తంతితపాలా, దీపములు మొదలగు ఉపకరణములుగా రాణిగారి పాలనముననే కావింపఁబడెను.

1837 వ సంవత్సరము జూన్ నెల 20 తేది విక్టోర్యాగారు లండన్ నగరమున సింహాసనమెక్కిన వృత్తాంతము హిందూదేశములోని వార్తాపత్రికలలో ఆగస్టునెల 25 వ తేది ప్రకటింపఁబడినది. ఇపుడు అంతటికాలవిళంబముపోయి షష్టిపూర్తి మహోత్సవ వృత్తాంతమును ఆదినముననే తంత్రీద్వారా తెలిసికొని ఆనాఁడే హిందూదేశములోని పత్రికలలో ప్రకటించుటకు అనుకూలము కల్గినది.

అపుడు ప్రపంచమందంతటను వేయియుపదునాలునూర్ల మైళ్ల పొడవు రైలుమార్గ ముండెను. ఇపుడు నాలుగులక్షల యిరువదివేల మైళ్ల పొడవు రైలుమార్గ మున్నది.

అపుడు ఆవిరిశక్తివలన గంటకు ఇరువదిమైళ్లుపోవునట్టి రైలుబండ్లను జూచి జనులు ఆశ్చర్యమొందిరి. ఇపుడు గంటకు అరువదిమైళ్లు పోయినప్పటికిని ఆశ్చర్యమని తలంపకుండు నంతటి స్వభావము గలవారైయున్నారు.

హిందూ దేశమునకుఁ గల్గిన మేలు

విక్టోర్యా మహారాజ్ఞిపాలనమున హిందూదేశమునందు వ్యవసాయము వృద్ధినొందెను. నదులకు ఆనకట్టలుకట్టఁబడెను. నదులలోనుండి తొమ్మిద వేలమైళ్లు పెద్దకాలువలును, ఇరువది వేలమైళ్లు పిల్లకాల్వలను త్రవ్వఁబడి జలము ప్రవహించుచున్నది. ఇందువలన బంజరుభూములును బాదువనేలలును పంటభూములైనవి. జనులు పూర్వమునకంటె మూఁడురెట్లు అధికమైనప్పటికిని ఇచటివారి భోజనమునకు చాలినంత ధాన్యముపోఁగా ఎనిమిదికోట్ల రూపాయల ధాన్యము ప్రతి సంవత్సరమునను ఇతరదేశములకు ఎగుమతి యగుచున్నది. పూర్వము క్షామము సంభవించెనేని, అది నివృత్తియగుటకు చాలకాలము పట్టుచుండెను. ఇపుడు ధాన్యము తెచ్చుటకుఁ దగినసాధనము లేర్పడియున్నందున కఱవు త్వరగా నివృత్తి యగుచున్నది. మొగలాయీల రాజ్యకాలములో భూమి చాలా తక్కువగా సేద్యము చేయఁబడినప్పటికిని భూమిపన్ను మాత్రము సంవత్సరమునకు ముప్పదిరెండుకోట్ల రూపా

యలు గానుండెను. ఇపుడు ఎక్కువ భూమి సాగుబడి చేయఁబడినప్పటికిని ఆంగ్లేయపాలకులు సంవత్సరమునకు ఇరువది కోట్ల రూపాయలకంటె అధికముగాఁ గైకొనుటలేదు.

ఇండియాదేశమునందు ప్రయాణమునకు అనుకూలములేర్పడియున్నందున వర్తకము అభివృద్ధి నొందుచున్నది. విక్టోర్యా చక్రవర్తిని పట్టాభిషేకకాలమునకుమున్ను కొన్నిబాటలేయుండినవి. అవియు అంతగా అనుకూలములు కావు. ఇపుడు మంచికంకర వైచి గట్టిచేసిన బాటలు పెక్కులు ఏర్పడినవి. సుమారు లక్షమైళ్లపొడవు బాట లున్నవి. పూర్వము ఇనుపదారియనెడి పేరే తెలియదు. ఇపుడు ఇరువదివేలమైళ్లపొడవు ఇనుపదారి యేర్పడినది. మున్ను కాశికిఁబోవుటయన్న మిగులశ్రమముగా నుండెను. ఇపుడు పొరుగూరికి పోయినట్లు పోయి రావచ్చును. మఱియు గంగా యమునా కృష్ణా గోదావరి మొదలగు నదులకు వంతెనలు కట్టఁబడి యున్నందున వర్షాకాలముననను, ప్రయాణము చేయవచ్చును. సముద్రతీరములయందలి పట్టణములయందు పొగయోడలు వచ్చి నిలుచుటకుఁ దగిన రేవు లేర్పడి యున్నవి. ఇందువలన ఎగుమతి దిగుమతులు సులభముగా జరగుచున్నవి. హిందూదేశములోని కాయధాన్యములును, ప్రత్తి, తోలు, నీలి, జనుపనార మొదలగు వివిధవస్తువులును సముద్రమార్గముగా నానాఁటికి అధికముగా ఎగుమతి యగుచున్నవి. ఆవిరియంత్ర సాహాయ్య

ముచే నెన్నియో కర్మశాలలు వృద్ధినొందినవి. అనఁగా బట్టలు నేయుట, ఇనుపపోత పోయుట, వడ్లుదంచుట, పిండి విసరుట, కాగితములుచేయుట మొదలగు పనులుచేయు యంత్రశాలలు స్థాపింపఁబడినవి.

మున్ను ఒకరిక్షేమమును వేఱొక రెఱుంగుట మిగుల కష్టముగా నుండెను. 1837 వ సంవత్సరమున హిందూదేశమున మొదల తపాలా కార్యస్థానము లేర్పఱుపఁబడినవి. అయినను బొంబాయినుండి కలకత్తాకు ఒక యుత్తరమునకు ఒక రూపాయి యీయవలసియుండెను. ఇప్పుడు కాలణాతో అతిశీఘ్రకాలమున క్షేమవార్తను బంపవచ్చును. సిలోను, రంగోనునకుకూడఁ కాలణా చాలును. మఱియు తత్‌క్షణమే వృత్తాంతమును తెలియఁజేయవలసినయెడల తంత్రీ ద్వారా *ఎనిమిదణాలు మొదలుకొని అధికవృత్తాంతములకు తగిన రుసుమును చెల్లించి తెలియఁజేయ వచ్చును.

లండన్ మొదలగు విదేశములకు టపాలా పంపఁబడుటయేగాక, తంత్రీద్వారాకూడా సమాచారములను దెలియపఱుపవచ్చును. మఱియు గొప్పపట్టణములయందుండు ధనవంతులును ఉద్యోగస్థులును పరస్పరము తమలోఁ దాము సంభాషించుటకు టెలిఫోనులు కలవు. మఱికొన్ని పట్టణముల

*అప్పుడు ఎనిమిదణాలుగానున్న ఈరుసుము ఇపుడు ఆఱణాలు.

లోని వీధులలో సంచరించుటకు విద్యుచ్ఛక్తిచే నడుపఁబడెడి బండ్లును కలవు. ధనికుల గృహములయందును కార్యస్థానములయందును విద్యుచ్ఛక్తి దీపములును వీవనలును నిర్మింపఁబడి యున్నవి. కొన్ని యంత్రములు విద్యుచ్ఛక్తిచే నడుపఁబడుచున్నవి.

పెక్కు స్థలములయందు ఆరోగ్యాభివృద్ధికొఱకు వైద్యశాలలు స్థాపింపఁబడినవి. గొట్టములద్వారా మంచిజలము వచ్చుట కేర్పాటు చేయఁబడినవి. టీకాలు పొడిపించుటకై శాసన మేర్పఱచి యందులకు వలయు పద్ధతులను క్రమమును నేర్పెడి కార్యస్థానము లేర్పఱుపఁబడియున్నవి.

విద్యాభివృద్ధి విషయమై విశేషప్రయత్నములు చేయఁబడుచున్నవి. 1857 వ సంవత్సరమునందు ఈదేశమున మూఁడు సర్వకలాశాల లుండినవి. 1887 వ సంవత్సరమునఁ జూడఁగా శాస్త్రపాఠశాలలును ఇతరపాఠశాలలును చేరి మొత్తము నూటముప్పదివే లయినవి. ఈ పాఠశాలలయందు మూఁడుకోట్ల నేఁబదిలక్షల విద్యార్థులు విద్యాభ్యాసము చేయుచుండిరి. విద్యావిషయమై రెండుకోట్ల యేఁబదిలక్షల రూపాయలు వ్యయము చేయుచున్నారు. రాణిగారు పట్టమునకు వచ్చిన కాలమునందు ఈదేశమున నాలుగైదు వృత్తాంతపత్త్రిక లుండినవి. ఇపుడు ఏనూటికంటె అధికముగానున్నవి. ఇదియునుగాక స్త్రీవిద్యాభివృద్ధికొఱకు అనేకములైన పాఠ

శాలలును కలాశాలలును ప్రత్యేకముగా నేర్పఱుపఁబడి ప్రోత్సాహము కలిగింపఁ బడినది.

మున్ను అచ్చటచ్చట నరబలులు, జంతుబలులు పెక్కులు కావింపఁబడుటయేగాక, శరీరమునందు అంపకోలలవంటి ముండ్లను గ్రుచ్చుకొని మ్రొక్కుబళ్లు చెల్లించెడి దుష్టమైన పద్ధతితోఁగూడిన గాలపుసిడులు మొదలగునవియు రూపుమాపఁబడినవి. ఈబలులలో బొత్తిగా నరబలులు నివృత్తి చేయఁబడినవి. జంతుబలులుకూడ చాలవఱకు తగ్గింపఁబడెను. ఇప్పటికిని సిడులు కొన్నిస్థలములలో జరుపఁబడెడిని. విద్యాహీనులుమాత్రము జంతుబలులను సిడులను అవలంబించి యున్నారు. దేశమందంతట విద్యాభివృద్ధి యగునేని యిట్టి దుష్టాచారము లన్నియు తొలఁగిపోవును. మఱియు ఉత్తర హిందూస్థానమందు జనులను కొట్టి దొంగిలించు మహాక్రూరులగు పాశకరులు దండింపఁబడిరి. ఈపాశకరులు వర్తకులవలె వేషముదాల్చి యాత్రచేయుచు బాటసారుల మెడలో హఠాత్తుగా దారమును (పాశమును) దగిలించి యీడ్చి చంపి వారిసొత్తులను గ్రహించుచుండిరి. ఇట్టి దొంగ మనుష్యులు ఇపుడు ఎచ్చటను కనఁబడరు. దారిదోపిడి కాండ్రను, బందిపోటుదొంగలను శిక్షించిరి. రాజ్యాంగములలో జనులకు ఎక్కువ స్వాతంత్ర్యము లొసఁగఁబడినవి. 1858 వ సంవత్సరమున మొట్టమొదట శాసననిర్మాణ సభ

లేర్పఱుపఁ బడినవి. అపుడు దొరతనమువారి యుద్యో గస్థులే సభ్యులు (మెంబర్లు) గా చేర్చుకొనఁబడుచుండిరి. 1861 వ సంవత్సరమునందు స్వదేశస్థులగు ప్రఖ్యాతి పురుషులను సహితము సభ్యులనుగా చేర్చుకొనుటకు అనుమతి నొసంగిరి. 1871 వ సంవత్సరమునందు నగర పారిశుధ్య విచారణ సంఘము (మునిసిపాలిటీ) లును, స్థలనిధి సంఘము (లోకల్ ఫండు బోర్డు) లును ఏర్పఱుపఁ బడినవి. వీనియొక్క పాలనము కొంతవఱకు హిందువుల కీయఁబడినది. అయినను అపుడున్న సభ్యులు దొరతనమువారిచే నియమింపఁబడిన వారుగా నుండిరి. 1883 వ సంవత్సరమునందు ఆసభ్యులలోఁ గొందఱను ఏర్పఱుచుకొనుటకు ప్రజలకు స్వాతంత్ర్య మియ్యఁబడినది. 1893 వ సంవత్సరమునందు శాసన నిర్మాణ సభలలో కొందఱు సభ్యులను నియమించికొనుటకు నగరపారిశుధ్యవిచారణ సంఘమువారికిని స్థలనిధి సంఘ పరిపాలకులకును స్వాతంత్ర్య మొసఁగఁబడినది. ప్రజలు రాజ భక్తికలవారైనచో ఇంకను ఎన్నియేని స్వాతంత్ర్యములను బడయవచ్చును.

చరమ దశ

విక్టోరియా మహారాజ్ఞిగారు ముదిమిచేతనేగాక, దక్షిణ ఆఫ్రికా యుద్ధమువలనఁ గలిగిన కష్టనష్టములచేతను చాల శిథిలమానసులై యుండిరి. అయినను రాజకీయ వ్యవహారగ

ములనుమాత్రము మిగుల జాగరూకతతో చేయుచుండిరి. ఆమె పట్టమునకు వచ్చినదిమొదలు గతించుటకు కొన్ని దినములకు ముందువఱకును ఏకరీతిగా పనిచేయుచుండిరి.

1900 వ సంవత్సరము జూలై నెల 30వ తేదీ రాణిగారి ద్వితీయ పుత్త్రుఁడు గతించెను. మఱియు, దక్షిణ ఆఫ్రికా యుద్ధమునందు బుద్ధిశాలి యని ప్రఖ్యాతినొందిన రాణిగారి మనుమఁడు క్రిస్టియన్ విక్టర్ అనునతఁడు ఆయుద్ధ మధ్యముననే గతించినందున నా వ్యసనము మఱింత వృద్ధినొందెను.

రాణిగారికి శరీరము నానాఁట కృశించుచుండెను. ఆమె యొక్క అనారోగ్యస్థితికి ఆమె కుటుంబమువారును స్నేహితులును ప్రజలును మిగుల చింతించుచుండిరి. మంత్రులు ఆమె యొక్క శరీరస్థితిని దెలిసికొని 1901 వ సంవత్సరము జనవరి నెల 18 వ తేది రాజాంగపద్ధతిచొప్పున దిగువ నుదహరించినట్లు ప్రకటించిరి:—

“ మహారాజ్ఞిగారికి శరీరము మునువున్నట్లు లేదు. స్వారిచేయుటకు ఆమెకు శక్తిలేదు. గతసంవత్సరమున సంభవించిన విచారముచేత ఆమె చాల బలహీనత జెందియున్నది. కాఁబట్టి ఆమె రాజకీయ వ్యవహారములను విచారింపక నెమ్మదిగా నుండుటయే మంచిదని ఆమెయొక్క వైద్యులు చెప్పుచున్నారు.”

అనంతరము మూఁడుదినములు రాణిగారి శరీరము పూర్వస్థితియందే యుండినది. 1901 వ సంవత్సరము జన వరి నెల 22 తేది మంగళవారము సాయంకాలము 6½ గంట లకు ఆస్‌బోర్న్ మందిరమునందు పరమపదము నొందిరి. రాణిగారి అవసానసమయమున ఆమెయొక్క కుమారులు, మనుమలు, విండ్సర్ అధ్యక్షగురువు, చేంబర్లేన్ ప్రభువు, మొదలగువారు ఆమెను పరివేష్టించి నిలువంబడి యుండిరి.

“రాణిగారు పరలోకవాసు లైరి” అనెడి వర్త మానము తెలిసినమీఁద సకల జనులును దుఃఖసాగరమున మునింగిరి. తమ శ్రేష్ఠనైన రాణిగారి వియోగమునకై గ్రేట్ బ్రిటన్ జనులందఱు దుఃఖించిరి; జమైకా దీవిలోని నీగ్రోలందఱును విలపించిరి; తమకు చాల మేలొనరించిన రాణిగారు పరలోక మేఁగినారని దక్షిణ ఆఫ్రికాలోని కాఫర్లు రోదనము చేసిరి; తమ మహాచక్రవర్తినిగారు కాలధర్మ మొందినందులకు హిందూజను లందఱును పరిపరివిధముల పరితపించిరి; కనడాయందు సుఖముగా వసించుచున్న ఎల్ల హిందువులు తమ రాణిగారు గతించినందులకై మిగుల వ్యసన మొందిరి.

ఈదుఃఖము ఆమెపాలనలోని రాజ్యమునంగల ప్రజ లకుమాత్రమేగాక, ఎల్లవారికిని దుఃఖముగానే యుండెను. అమెరికాఖండములోనివారును మిక్కిలి చింతించిరి. రాణి

గారికిఁగల దయయును, సౌమ్యమునే సమస్తమైనవారిని దుఃఖసాగరమున మునుంగునట్లు చేసినదేగాని వేఱుకాదు. ఎప్పుడును పరోపకారము చేయుటయందే రాణిగారు ఆసక్తి కలవారై యుండిరి; దేశక్షేమమునకై యెన్నియేని సత్కార్యములు చేసిరి; ఎన్నియో మంచిపనులకు సహాయము చేసిరి; పరులదుఃఖమును తమదుఃఖముగా భావించు స్వభావము గలవారై యుండిరి; ఆమె దీర్ఘాలోచన చేయక యేకార్యమును చేసినది లేదు; రాజాంగ వ్యవహారములయందు మిగుల సమర్థత కలవారు; పక్షపాతములేక పాలన చేయుచుండిరి; సామాన్యముగా సకలసద్గుణములును ఆమెయందు నెలకొని యుండినవి.

విక్టోరియామహారాజ్ఞిగారి కనంతరము ఆమె జ్యేష్ఠకుమారులు వేల్సు యువరాజుగారైన సప్తమ ఎడ్వర్డు ప్రభువుగారు రాజ్యమునకు పట్టభద్రులైరి.

సంపూర్ణము.

PRINTED AT THE CHANDRA PRESS, MADRAS — 1912.

బాలురకుఁ దగిన పుస్తకములు

మేము బాలురయొక్కయు బాలికలయొక్కయు విద్యాభివృద్ధికిని సన్మార్గమునకును అనుకూలమైనను అత్యావశ్యకమును అగు కొన్ని నీతివచన పుస్తకములను ప్రకటించి యున్నాము. ఈపుస్తకములు ఒక్కొకటియు చదువఁ దొడంగినది మొదలు ముగియునంతదాఁక మనస్సునకు ఆహ్లాదము నొసంగునట్టివిగా నున్నవి. ప్రతి పుస్తకమును మంచినీతియు ధర్మమును బోధించును. ఇవి ఎలిమెంటరీపాఠశాలలోఁ జదువు బాలురకును బాలికలకును గృహపాఠముగా చదివించుటకు మిక్కిలి యోగ్యమైనవి. ఈపుస్తకములన్నియు చదువుటకు సులువుగా నుండులాగున రచియింపఁబడి యున్నవి. ఇవి మంచి కాగితములు; మంచి అచ్చు కలవి.

		రూ. అ. పై
1.	ఆలిబాబా	0—4—0
2.	ఆలోచనగల్ల అంగుష్ఠుని కథ	0—1—6
3.	జానకి	0—1—6
4.	నలుఁడు	0—1—6
5.	మంచిబాలుఁడు	0—1—0
6.	మంచిస్నేహితులు	0—1—0
7.	కుచేలుఁడు	0—1—0
8.	అపదయందు స్నేహితులు	0—1—0
9.	వనకన్య	0—1—0

సి. కుమారస్వామి నాయుఁడు సన్సు.